teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 89 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 6 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## తిరుపతి వెళ్లే రైలు ప్రయాణికులకు గుడ్‌న్యూస్

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు 20 బోగీలతో అప్‌గ్రేడ్

ప్రకటన విడుదల చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



02



## విద్యాశాఖ నా వద్దే ఉండాలని అనుకున్నా

200 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తాం

అక్కడి విద్యను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేస్తాం

గురుపూజోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

.. వివరాలు 2లో



## విద్యా రంగంపై ఊహించని రీతిలో పెట్టుబడులు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన

.. వివరాలు 2లో

# బై బై గణేశా..

## ఘనంగా గణేష్ నిమజ్జనం

- భక్తి పారవశ్యంలో తెలుగు రాష్ట్రాలు
- ఊరూవాడా పండుగ వాతావరణం
- నిమజ్జన ప్రాంతాల్లో పటిష్టమైన పోలీసు భద్రత



పది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కొలిచిన గణేశుడికి వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైంది. శుక్రవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. నగరాలు, పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా అన్ని చోట్లా పండగ వాతావరణం నెలకొంది. గణేశ్ ఉత్సవాలు ముగియడంతో భక్తులు తమ ఇళ్లలో, మండపాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.






## గ్రామీణ పాలనకు కొత్త ఊపు





- గ్రామ స్వరాజ్యం దిశగా కీలక అడుగు
- 6,700 మంది జీపీఓలుగా నియామకం
- నియామక పత్రాలు అందజేసిన సీఎం
- త్వరలో మండలాల కేటాయింపు
- పాలనలో పారదర్శకత, ప్రజలకు చేరువ కావడమే లక్ష్యం : సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పాలనను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో, నూతనంగా నియమితులైన 6,700 మంది గ్రామ పంచాయతీ అధికారులకు

మిగతా 2 లో

## నగరంలో టీ స్టాల్స్‌పై ఆకస్మిక దాడులు

### నకిలీ టీ పొడిపై ఫుడ్ సేఫ్టీ అధికారుల ఫోకస్

వెలుగులోకి మోసం చేయడానికి అనుసరిస్తున్న కొత్త పద్ధతులు

కల్తీని గుర్తించే మార్గాలు వెల్లడి చేసిన అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నగరంలో కల్తీ టీ పొడి విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారం మేరకు, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు నగరవ్యాప్తంగా టీ పౌడర్ యూనిట్లు, టీ స్టాల్స్‌పై ఆకస్మిక తనిలు నిర్వహించారు. తమ వీక్లీ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మొత్తం 42 టీ పౌడర్ యూనిట్లు, టీ పాయింట్లలో తనిలు చేశారు. ఈ తనిల్లో వ్యాపారులు

మిగతా 2 లో





## ఆధార్‌లో ఏపీ అడ్రస్ ఉన్నా..

- ఇతర కార్డులతో ఉచిత బస్సు ప్రయాణం
- ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో నివసిస్తున్న మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని మరింత సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు, ఆధార్ కార్డులో ఆంధ్రప్రదేశ్ చిరునామా ఉన్న కారణంగా అనేకమంది మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు, ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. కొత్త

మిగతా 5 లో

## బతుకమ్మకు రేవంతన్న కానుక

- కానుకగా మహిళలకు చీరల పంపిణీ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం
- ఒక్కోదాని విలువ రూ. 800
- 65 లక్షల చీరలు పంపిణీకి సిద్ధం
- సెప్టెంబర్ 22 నుంచి పంపిణి ప్రారంభం
- చేనేత కార్మికులకు ఊపిరి పోస్తున్న ఇందిరా మహిళా శక్తి



హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం బతుకమ్మ పండుగ కానుకగా మహిళలకు చీరల పంపిణీ నిర్ణయం తీసుకుంది. పండుగ పూట ఆడబిడ్డల కళ్ళల్లో ఆనందం నింపే 'రేవంతన్న బతుకమ్మ కానుక' తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా

మిగతా 2 లో



## భారీ వర్షాలతో రాష్ట్రంలో 5,018 కోట్ల నష్టం


### కేంద్రం సాయం కోరిన రాష్ట్ర ప్రభుత్వం

సదుపాయాల పునరుద్ధరణకు రూ. 16వేల కోట్లు అవసరం

తక్షణమే విడుదల చేయాలని అమిత్ షాకు వినతి

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా తెలంగాణలో పంట, ఆస్తి, ప్రాణ నష్టం జరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే సాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో

## సీబీఐ డైరెక్టర్ పర్యటనపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ



కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై సీబీఐ విచారణ?

హైదరాబాద్‌కి సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్

.. వివరాలు 2లో

## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి సొమ్ము పంపకాల పంచాయతీ



- ధరణి పేరుతో భూములను కబ్జా చేశారని విమర్శలు
- కవిత నిర్వాకంవల్లే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా
- కవితపై ఎమ్మెల్యే కడియం సంచలన వ్యాఖ్యలు

.. వివరాలు 2లో



## రాష్ట్రంలో యూరియా సంక్షోభం

### సంక్షోభాన్ని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- విమర్శలు గుప్పించిన కేటిఆర్
- రైతు లక్ష్మణ్‌పై కేసు సీఎం దిగజారుడు తనానికి నిదర్శనం
- రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): యూరియా సంక్షోభాన్ని తన చేతకానితనంతో సృష్టించిన కోపాగ్నితో రగిలిపోతున్న లక్షలాది రైతులపై కేసులు పెట్టే దమ్ము ఈ సర్కారుకు ఉందా ? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిపై

మిగతా 5 లో



## బీఆర్ఎస్‌లో కేసీఆరే సుప్రీం లీడర్

- ప్రజాసేవ చేయడమే కేసీఆర్ నేర్పించారు
- ఎవరి విషయంలోనైనా పార్టీదే తుది నిర్ణయం
- లండన్ పర్యటనలో హరీశ్ రావు
- కవిత ఆరోపణలపై పరోక్షంగా హరీష్ రావు కౌంటర్

05

# బై బై గణేశా..

హైదరాబాద్: సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): పది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కొలిచిన గణేశుడికి వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైంది. శుక్రవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. నగరాలు, పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా అన్ని చోట్లా పండగ వాతావరణం నెలకొంది. గణేశ్ ఉత్సవాలు ముగియడంతో భక్తులు తమ ఇళ్లలో, మండపాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.





**శోభాయాత్రలతో సందడి**

గణేశ్ విగ్రహాలను లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో ఊరేగిస్తూ నిమజ్జన ప్రాంతాలకు తీసుకెళ్లారు. డప్పు వాయిద్యాలు, డీజే పాటలు, నృత్యాలతో శోభాయాత్రలు మరింత ఉత్సాహంగా సాగాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగులు చల్లుకుంటూ, 'గణపతి బప్పా మోరియా' అంటూ నినాదాలు చేస్తూ భక్తులు నృత్యాలు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్, ఖైరతాబాద్ గణేషుడి నిమజ్జనం కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

**భారీ భద్రతా ఏర్పాట్లు**

నిమజ్జన కార్యక్రమం శాంతియుతంగా జరిగేలా పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రాంతాల్లో, శోభాయాత్రలు వెళ్లే మార్గాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. వారి కృషి వల్ల నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తయింది.





**పర్యావరణ హిత గణపతులు**

గత కొన్ని సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో, ఈసారి కూడా మట్టి గణపతుల నిమజ్జనం ఎక్కువగా జరిగింది. అనేక స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు మట్టి గణపతులను ప్రోత్సహించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల కరే మట్టి గణపతులు నీటిని కలుషితం చేయవని, పర్యావరణానికి మేలు చేస్తాయని భక్తులు గుర్తించారు. చాలా చోట్ల కృత్రిమ కొలనులను ఏర్పాటు చేసి, వాటిలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

**మహాప్రసాదం పంపిణీ**

నిమజ్జన కార్యక్రమం అనంతరం భక్తులకు మహాప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనేక ప్రాంతాల్లో అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. పది రోజుల పండుగ ముగియడంతో భక్తులు వచ్చే సంవత్సరం గణేశుడిని తిరిగి ఆహ్వానించేందుకు ఎదురుచూస్తున్నారు. మొత్తంగా, ఈ సంవత్సరం గణేశ్ నిమజ్జనం భక్తి, ఆనందం, ఉత్సాహం కలగలిపి ఘనంగా ముగిసింది.

# విద్యాశాఖ నా వద్దే ఉండాలని అనుకున్నా

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో నిర్వహించిన గురుపూజోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ క్రమంలో సభను ఉద్దేశించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్. తెలంగాణలో గురుపూజోత్సవం జరిగితే గతంలో సీఎం వచ్చారా..? అసలు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిందా..? కానీ ఇప్పుడు సీఎంగా తాను వచ్చానని అన్నారు. కాంట్రవర్సీ అయినా పర్వాలేదు విద్యాశాఖ తనదగ్గరే ఉండాలని అనుకున్నానని అన్నారు సీఎం రేవంత్. సాధారణంగా ముఖ్యమంత్రులు ఫైనాన్స్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలను తమ దగ్గర పెట్టుకుంటారని అత్యంత ప్రాధాన్యతతో కూడిన విద్యా శాఖను తన దగ్గర పెట్టుకున్నానని అన్నారు. విద్యా శాఖ బాగుపడొద్దనే ఉద్దేశంతో కొంత మంది విద్యా శాఖకు మంత్రినీ ఏర్పాటు చేయాలాంటున్నారని సీఎం విద్యా శాఖ చూస్తే విద్యా శాఖ ప్రక్షాళన జరుగుతుందని కొందరు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పరిపాలనలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ముందు వరుసలో ఉంటారని ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా టీచర్ల సమస్యలు అలాగే ఉండిపోయాయని అన్నారు సీఎం రేవంత్. మూడు లక్షల కోట్ల బడ్జెట్ అన్న గత పాలకులు నాణ్యమైన భోజనం అందించలేకపోయారని విద్యా శాఖ మీద ఆధిపత్యం చెలాయించాలని గత పాలకులు భావించారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీలు మూత పడే పరిస్థితులు వచ్చాయని అన్నారు. గురుపూజోత్సవ కార్యక్రమానికి గత సీఎం ఎప్పుడైనా వచ్చారా అని ప్రశ్నించారు సీఎం రేవంత్. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గిపోవడానికి బాధ్యత సీఎంగా తనది, ఉపాధ్యాయులదే అని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మౌలిక సదుపాయాల నిర్వహణ చేస్తున్నామని డైట్ ఛార్జీలు పెరిగి, సన్నం బియ్యం ఇచ్చినా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఉపాధ్యాయులు సైతం భోజనం చేయాలని అప్పుడే ఫుడ్ పాయిజన్ ఘటనలు ఆగిపోతాయని స్పష్టం చేశారు సీఎం రేవంత్. విదేశాలకు ప్రభుత్వ టీచర్లను పంపిస్తామని అభివృద్ధి చెందిన దేశాలలో అందిస్తున్న విద్యను అధ్యయనం చేయడానికి విదేశాలకు పంపిస్తామని అన్నారు. ప్రతి ఏడాది 200 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తామని.. అక్కడ అందుతున్న విద్యను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయాలని అన్నారు.

# విద్యారంగంపై ఊహించని రీతిలో పెట్టుబడులు

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): విద్యా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం ఎవ్వరు ఊహించని రీతిలో పెట్టుబడులు పెడుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యపై పెట్టుబడి రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడుతుందని మా ప్రభుత్వం నమ్ముతోందన్నారు. శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లో మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ను ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. కళాశాల విద్యను పూర్తి చేసుకుని బయటకు వెళ్లగానే విద్యార్థులు ఉద్యోగాలు పొందే విధంగా స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ రూపొందించి అమలు చేస్తున్నట్టు తెలిపారు. పారిశ్రామిక వేత్తలతో మాట్లాడి స్కిల్ యూనివర్సిటీ సిలబస్ రూపొందిస్తామన్నారు. యువ రాష్ట్రమైన తెలంగాణ ప్రపంచంతో పోటీపడుతోందని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఐఎస్ బీ విద్యార్థులు సహకరరించాలని కోరారు. రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఐఎస్ బీలో 5 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం రూపొందించి అమలు చేయాలని నిర్వాహకులను భట్టి విక్రమార్క కోరారు. తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు.

# సీబీఐ డైరెక్టర్ పర్యటనపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకల విచారణను తెలంగాణ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి అప్పగించిన వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ శుక్రవారం (సెప్టెంబర్ 5) హైదరాబాద్‌కు వచ్చారు. హైదరాబాద్ సీబీఐ ఆఫీసులో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వ్యక్తిగత పనుల మీద ప్రవీణ్ సూద్ హైదరాబాద్‌కు వచ్చినట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి. కానీ, కాళేశ్వరం విచారణను తెలంగాణ సర్కార్ సీబీఐకి అప్పగించిన ఐదు రోజుల్లోనే సీబీఐ డైరెక్టర్ స్వయంగా హైదరాబాద్ రావడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రవీణ్ సూద్ వ్యక్తిగత పనుల మీద హైదరాబాద్ వచ్చినట్లు సీబీఐ వర్గాలు పేర్కొంటున్నప్పటికీ కాళేశ్వరం కేసు గురించి డిస్కస్ చేసేందుకు ఆయన నేరుగా హైదరాబాద్ వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తానికి సీబీఐ డైరెక్టర్ హైదరాబాద్ టూర్ స్టేట్ పాలిటిక్స్‌లో ముఖ్యంగా గులాబీ పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణ కోరిన విషయం తెలిసిందే. నేషనల్‌డ్యామ్‌సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) రిపోర్ట్ ఆధారంగా కేసు దర్యాప్తు చేయాలని ప్రభుత్వం సీబీఐని కోరింది. అందులో భాగంగానే ఇప్పటికే కాళేశ్వరానికి సంబంధించిన అన్ని నివేదికలను సీబీఐకి ఇచ్చింది. ఈ కేసు విచారణ కోసం రాష్ట్రంలో సీబీఐ ఎంట్రీకి ఉన్న నిషేధాన్ని కూడా సడలించింది ప్రభుత్వం. కాళేశ్వరం కేసు విచారణ చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరడంతో సీబీఐ రంగంలోకి దిగనుంది. ప్రభుత్వం సమర్పించిన నివేదికల ఆధారంగా కేసు నమోదు చేసి ఎంక్వైర్వీ స్టార్ట్ చేయనుంది సీబీఐ.

# తిరుపతి వెళ్లే రైలు ప్రయాణికులకు గుడ్‌న్యూస్

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే రైల్వే ప్రయాణికులకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుడ్‌న్యూస్ చెప్పారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతికి పెరుగుతున్న భక్తుల ప్రయాణ అవసరాల దృష్ట్యా సికింద్రాబాద్ – తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలను 16 నుంచి 20 బోగీలకు అప్‌గ్రేడ్ చేసేందుకు రైల్వే శాఖ అంగీకరించిందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ 2023 ఏప్రిల్‌లో సికింద్రాబాద్ – తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించారు.

అప్పటి నుంచి శ్రీ వేంకేశ్వర స్వామి దర్శనార్థం తిరుపతి వెళ్లే భక్తులకు వందే భారత్ ఆధునిక, సౌకర్యవంతమైన రైలు ప్రయాణానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ క్రమంలో పెరుగుతున్న భక్తుల ఆదరణను గుర్తించి నా విజ్ఞప్తి మేరకు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వందే భారత్ బోగీలను 16 నుంచి 20 బోగీలకు పెంచడానికి అంగీకరించారని వివరించారు. దీంతో తిరుపతి వెళ్లే భక్తులందరికీ రైలు ప్రయాణం మరింత సౌకర్యవంతం, వేగవంతం కానుందని కిషన్ రెడ్డి ట్వీట్‌లో వెల్లడించారు. కాగా, రైలు నంబర్ 20701/20702 సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో 16 నుంచి 20కి పెంచనున్నారు.

# గ్రామీణ పాలనకు కొత్త ఊపు

మొదటి పేజీ తరువాయి





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో అట్టహాసంగా నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి ఎంపికైన GPOs ఈ చారిత్రక కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాల కలెక్టరేట్ల నుండి ప్రత్యేక బస్సుల్లో ఈ అధికారులు హైదరాబాద్‌కు తరలివచ్చారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడంలో భాగంగా ఈ GPOల నియామకం ఒక ముఖ్యమైన ముందడుగుగా పరిగణించబడుతోంది. గ్రామ పంచాయతీల నిర్వహణలో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో, మరియు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ఈ అధికారులు కీలక పాత్ర పోషించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యం సాధించడంలో GPOs భవిష్యత్తులో ముఖ్యమైన భాగస్వాములు అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. "గ్రామ పంచాయతీల బలోపేతం అనేది మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈ అధికారులు ఆ దిశగా కీలక పాత్ర పోషిస్తారు" అని ఆయన అన్నారు.

**మండలాల కేటాయింపు & విధులు**

నియామక పత్రాలు పొందిన GPOs కు త్వరలో మండలాల్లో పోస్టింగ్‌లు కేటాయించబడతాయి. మండలాల కేటాయింపు పూర్తి పారదర్శకంగా, స్థానిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పోస్టింగ్‌ల తరువాత, ఈ అధికారులకు వారి విధులు, బాధ్యతలు, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల పరిపాలన, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ సేవలు వంటి అంశాలపై ఈ శిక్షణలో వారికి సమగ్ర అవగాహన కల్పించనున్నారు.

**GPOs నిర్వర్తించాల్సిన ప్రధాన బాధ్యతలు:**

గ్రామ పంచాయతీ పాలన నిర్వహణ: GPOs గ్రామ పంచాయతీ కార్యనిర్వహణలో పంచాయతీ కార్యదర్శులకు సహాయం చేస్తారు. గ్రామ సభలు, పంచాయతీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించడం, వాటి తీర్మానాలను అమలు చేయడం వీరి బాధ్యత.

ప్రభుత్వ పథకాల అమలు: ప్రభుత్వ పథకాలైన ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ వంటి వాటిని గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో వీరు పర్యవేక్షిస్తారు.

రికార్డుల నిర్వహణ: గ్రామ పంచాయతీకి సంబంధించిన ఆర్థిక రికార్డులు, ఆస్తుల వివరాలు, రిజిస్టర్లు, పన్ను వసూళ్ వంటి వాటిని డిజిటల్ మరియు భౌతిక రూపంలో నిర్వహించడం.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి: ప్రజల సమస్యలను సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం.

గ్రామాభివృద్ధి ప్రణాళికలు: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (GPDP) రూపొందించడంలో సహకారం అందించి, గ్రామాన్ని స్వయం సమృద్ధిగా మార్చేందుకు కృషి చేయడం. ఈ నియామకాలు తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో పాలనను మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువగా తీసుకెళ్తాయని, ఇది గ్రామ స్వరాజ్య స్థాపనకు ఒక బలమైన పునాది అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోని గ్రామీణ పాలనకు కొత్త ఊపునిస్తుందని భావిస్తున్నారు.

# నగరంలో టీ స్టాల్స్‌పై ఆకస్మిక దాడులు




మొదటి పేజీ తరువాయి

ప్రజలను మోసం చేయడానికి అనుసరిస్తున్న కొత్త పద్ధతులు వెలుగులోకి వచ్చాయి. నాసిరకం టీ పొడిని, అచ్చు అసలు టీ పొడి రంగు, రుచి, వాసన ఉండేలా కృత్రిమ రసాయనాలతో కల్తీ చేస్తున్నారని అధికారులు గుర్తించారు. ఈ నమూనాలలో 19 శాంపిల్స్‌ను స్టేట్ ఫుడ్ ల్యాబ్స్‌కు పరీక్షల నిమిత్తం పంపారు. పూర్తి స్థాయి నివేదికలు వచ్చిన తర్వాత, నిబంధనలను ఉల్లంఘించిన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

**కల్తీ టీ పొడిని గుర్తించే మార్గాలు**

ప్రజలు తాము కొనుగోలు చేసే టీ పొడి కల్తీదా లేక అసలైనదా అని సులభంగా గుర్తించేందుకు అధికారులు కొన్ని చిట్కాలను వెల్లడించారు.

తడి గుడ్డపై పరీక్ష: ఒక తడి గుడ్డపై కొద్దిగా టీ పొడిని తీసుకుని రుద్దాలి. కల్తీ టీ పొడి అయితే పసుపు రంగులోకి మారుతుంది, అదే అసలైన టీ పొడి అయితే రంగు మారదు.

నీటిలో పరీక్ష:

ఒక గ్లాసులో నీరు తీసుకుని అందులో కొద్దిగా టీ పొడి వేయాలి. కల్తీ టీ పొడి అయితే వెంటనే ముదురు ఎరుపు రంగులోకి మారుతుంది, అదే అసలైన టీ పొడి అయితే చాలా నెమ్మదిగా లేత రంగును విడుదల చేస్తుంది.

ఈ సాధారణ పరీక్షల ద్వారా టీ పొడిని సులువుగా పరీక్షించుకుని, ఆరోగ్యానికి హానికరమైన కల్తీ ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా జాగ్రత్త పడవచ్చు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నాణ్యతలేని ఉత్పత్తులను విక్రయించే వారిపై ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

# కాలేశ్వరం ప్రాజెక్టు అవినీతి సొమ్ము పంపకాల పంచాయతీ

జనగామ, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. కవిత నిర్వాకం వల్లే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు చెప్పారు. లిక్కర్ స్కామ్ లో కవిత అరెస్టు తన మనసును కలచివేసిందని అన్నారు. అవినీతిపరులతో ఉండలేక పార్టీని వీడానని చెప్పారు. కాలేశ్వరం ప్రాజెక్టు అవినీతి సొమ్ము పంపకాల పంచాయతీ జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం ఆరోపించారు. అందుకే ఒకరిపై ఒకరు విమర్శలకు దిగుతున్నారని అన్నారు. గత పదేళ్లు ధరణి పేరుతో భూములను కబ్జా చేశారని విమర్శించారు. అధికారం అడ్డుపెట్టుకొని కల్వకుంట్ల ఫ్యామిలీ తెలంగాణను దోచుకుందని విమర్శలకు దిగారు. కల్వకుంట్ల కుటుంబం గొడవతో తెలంగాణ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని అన్నారు. కాళేశ్వరం అవినీతికి కారణం హరీశ్ రావేనని కవిత ఇటీవల సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. హరీష్, సంతోష్ రావుల కారణంగానే అవినీతి జరిగిందని ఆరోపించడంతో పార్టీ నుంచి స్పెండ్ చేశారు.

# బతుకమ్మకు రేవంతన్న కానుక

మొదటి పేజీ తరువాయి

విభాగం ఏ%జశీఅస్త్రతీవం4ూ% శుక్రవారం ఎక్స్ వేదిక వెల్లడించింది. ఇందిరా మహిళా శక్తి చీరలు గౌరవం, సంతోషం, స్వాభిమానానికి ప్రతీక అని పేర్కొంది. ప్రతి మహిళకు రెండు నాణ్యమైన చీరలు, ఒక్కొక్కటి రూ. 800 విలువ గలవి అని తెలిపింది. సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల చీరల పంపిణీ చేయనున్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఆడబిడ్డల బతుకమ్మ వేడుకలకు కొత్త వెలుగు. 6000 మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తూ చేనేత రంగాన్ని ప్రజా ప్రభుత్వం కాపాడుతోందని తెలిపింది. ఒకవైపు పండుగ ఆనందం, మరోవైపు చేనేతకు ఊపిరి, ఇదే కాంగ్రెస్ ప్రజా సర్కార్ ప్రత్యేకత అని ఎక్స్‌లో తెలంగాణ కాంగ్రెస్ బతుకమ్మ చీరల ఫోటోలను పంచుకుంది.

# భారీ వర్షాలతో రాష్ట్రంలో 5,018 కోట్ల నష్టం

మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏ.పీ. జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు కలిసి గురువారం ఢిల్లీలో అమిత్ షా అధికారిక నివాసంలో కలసి పూర్తి వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

"2025 ఆగస్టు 25-28 మధ్య తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో వరదలు సంభవించి భారీ విధ్వంసం సృష్టించాయి. ఈ జిల్లాల్లో మౌలిక సదుపాయాలకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన వర్షపాతం సాధారణం కరే 25 శాతం అధికంగా ఉంది. ఎనిమిది జిల్లాల్లో 65 నుంచి 95 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. వర్షాలు కొనసాగుతూనే ఉండటంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు, పంటలు, పశువులు, మానవ ప్రాణాలు నష్టపోయాయి" అని మంత్రులు వివరించారు.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం వనరులను సమీకరించి సహాయ చర్యలు చేపడుతుందని, ఏడు ఎన్డీఆర్ఎఫ్, 15 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, సుమారు 100 మంది సైనిక సిబ్బంది సహాయకార్యకలాపాలలో పాల్గొంటున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణతో ప్రాణనష్టాన్ని



సాధ్యమైనంతవరకు తగ్గించగలిగామని మంత్రులు పేర్కొన్నారు. అయితే, గత 72 గంటల్లో కురిసిన వర్షాల తీవ్రతతో రోడ్లు, రైల్వే ట్రాక్‌లు, కల్వర్టులు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా సాధారణ జీవన విధానానికి అంతరాయం ఏర్పడిందని స్పష్టంచేశారు. ఈ పరిస్థితిని జాతీయ విపత్తుగా పరిగణించాలని కేంద్ర హోంమంత్రిని కోరారు. అదేవిధంగా, వరద ప్రభావిత ప్రాంతాలను స్వయంగా సందర్శించి నష్టాలను అంచనా వేయాలని, కేంద్ర ప్రభుత్వ బృందాన్ని తెలంగాణకు పంపాలని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ఇప్పటివరకు రాష్ట్రంలో 22 మరణాలు సంభవించాయని, పాడి పశువుల మరణాలు, గృహ నష్టాలు, పంట నష్టాల గణన కొనసాగుతోందని మంత్రుల బృందం వివరించింది.

**మౌలిక సదుపాయాల నష్టాలు (ప్రాథమిక అంచనాల ప్రకారం):**

1. రోడ్లు (ఆర్&బీ) – ₹785.59 కోట్లు
2. ఇంధన శాఖ (విద్యుత్) – ₹40.73 కోట్లు.
3. పంట నష్టం – ₹236 కోట్లు
4. నీటిపారుదల – ₹655.70 కోట్లు
5. పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి – ₹377.43 కోట్లు
6. వైద్య & ఆరోగ్య శాఖ – ₹14.84 కోట్లు
7. పశుసంవర్ధక శాఖ – ₹10 కోట్లు
8. మున్సిపల్ పరిపాలన – ₹1025 కోట్లు
9. అత్యవసర మరమ్మతులకు తక్షణ నిధుల అవసరం – ₹1500 కోట్లు
10. ఇతర శాఖలు / ప్రభుత్వ ఆస్తులు – ₹300 కోట్లు
11. గృహనిర్మాణ శాఖ – ₹25 కోట్లు
12. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం – ₹23.43 కోట్లు.

మొత్తం (ప్రాథమిక అంచనాలు): ₹5018.72 కోట్లు

గత ఏడాది ఖమ్మం, పరిసర జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా రూ.11,713 కోట్ల సహాయం కోరినా, ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదని. కేవలం సాధారణ నిధులే విడుదలయ్యాయని, దాంతో పునర్నిర్మాణంలో ఇబ్బందులు ఏర్పడ్డాయని వివరించారు. అందువల్ల గతంలో కోరిన రూ.11,713 కోట్లతో పాటు తాజా అంచనా రూ.5,018 కోట్లు ం మొత్తం రూ.16,732 కోట్లను కేంద్రం తక్షణమే విడుదల చేయాలని బృందం విజ్ఞప్తి చేసింది. ఈ విజ్ఞప్తికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సానుకూలంగా స్పందించారు. త్వరలో కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందాన్ని తెలంగాణకు పంపి నష్టాలను అంచనా వేయిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

# సమాజ మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులు

### రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్

### జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం

### ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్



హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): సమాజ మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో హనుమకొండ జిల్లా పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో పూర్వ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ని పురస్కరించుకుని గురు పూజోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి డాక్టర్ బండా ప్రకాష్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, డీఈవో వాసంతి, తదితరులు పూలమాలలు వేసిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర శాసనమండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ మాట్లాడుతూ విద్య ఇచ్చిన గొప్ప అవకాశం తోనే ఈ స్థాయికి ఎదిగామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులే తనను ప్రభావితం చేశారని అన్నారు. పాఠశాల నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు తన ఉపాధ్యాయులు, అధ్యాపకుల బోధనలతో తీర్చిదిద్దడం వల్లనే ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. జిల్లాలో 1,45,294 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండడం చాలా గొప్ప విషయం.. అభినందనీయమని అన్నారు. కొన్ని జిల్లాల్లో చదువుకునే వారి సంఖ్య తక్కువ శాతం ఉందని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడానికి గల కారణాలను గతంలో పరిశీలించిన అనంతరం జిల్లాలో దాదాపు 22 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాసులకు నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో మాదిరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ డిజిటల్ విద్యా బోధన విధానం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. కొన్ని గ్రామాలలో వివిధ కారణాల వల్ల ఉపాధ్యాయుల సంఖ్య ఉన్నప్పటికీ విద్యార్థులు లేరని అన్నారు. శాసనమండలి సమావేశాలలో ఒకరోజు విద్య పైనే సమావేశం పెట్టామని, ఆ సమావేశంలో ముఖ్యమంత్రి సహా పాల్గొన్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. విద్యారంగంలో మనం చేయాల్సిన కృషి ఇంకా ఎంతో ఉందన్నారు. సమాజం పట్ల ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమాజ లక్ష్యాలను చేరుకునే విధంగా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలు మరింత మెరుగుపడాలన్నారు. అభ్యసన పద్ధతులను ఉపాధ్యాయులు మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమైనరీతిలో ఉపాధ్యాయులు బోధించాలన్నారు. స్ఫూర్తిగా నిలిచే ఉపాధ్యాయుల కథనాలను చదివి అదే నమూనాలో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధనను అందించాలని కోరుకుంటామని అన్నారు. ఎంతోమంది ఉపాధ్యాయులు తమ ప్రభుత్వ పాఠశాలలకు సదుపాయాలు, విద్యార్థులకు సహాయం చేస్తుండడం చూస్తుంటామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గ నిర్దేశకుడిగా, సలహాదారుగా వ్యవహరించాలని కోరారు. విద్యారంగానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు విజయవంతంగా అమలు కావాలన్నారు. జిల్లాలో సైన్స్ ఫెయిర్ బాగా జరుగుతున్నాయని, గతంలో మాదిరిగానే సృజనోత్సవం కార్యక్రమాలను తిరిగి ప్రతి సంవత్సరం నవంబర్ 14వ తేదీన నిర్వహించాలని సూచించారు. సృజనోత్సవం కార్యక్రమం నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను బయటకు తీసుకురావడానికి దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జీవితంలో అనుకున్న లక్ష్యం సాధించడానికి, ఎదగడానికి విద్యనే సహాయపడుతుందని అన్నారు. దేశానికి ఐఏఎస్, ఐపీఎస్, అధికారులు, వివిధ రంగాల వారిని అందించే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఉపాధ్యాయులు ఒక్క విద్యారంగంలోనే కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలలో భాగస్వాములు అవుతున్నారని అన్నారు. తన దృష్టిలో ప్రతి టీచర్ బెస్ట్ యేనని, ఆర్డినరీ టీచర్ అంటూ ఎవరు ఉండరని అన్నారు. తాను వచ్చినప్పటి నుండి ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను చూస్తున్నానని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత ప్రతిభను గుర్తించి వారిని ముందుకు నడిపేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు. విలువలు కలిగిన సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఒక దేశం అభివృద్ధి చెందటం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత పైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఏదైతే బోధిస్తారో అది గుర్తుండి పోతుందన్నారు. ప్రతి టీచర్ ఏదో ఒక విషయంలో గొప్పగా ఉంటారని అందుకే ప్రతి టీచర్ ఉత్తములేనని పేర్కొన్నారు. సమాజం బాగుపడాలరే అది ఉపాధ్యాయుల కృషితోనే సాధ్యమని అన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి డి. వాసంతి మాట్లాడుతూ పాఠశాల విద్యలో హనుమకొండ జిల్లా ముందుందని అన్నారు. జిల్లాలో 873 పాఠశాలలు ఉన్నాయని, ఒక లక్షకు పైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారని తెలిపారు. విలువలతో కూడిన భావి భారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యారంగంలో దేశంలోనే జిల్లాకు మంచి స్థానంలో నిలబ్టే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. హనుమకొండ జిల్లాలో 45 పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించామని, 500 వరకు ప్రవేశాలు జరిగాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రవేశాలు పెరగనున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల పురోగతికి జిల్లా కలెక్టర్ అందిస్తున్నారని అన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అనుకున్న వాటికరే ఎక్కువ అడ్మిషన్స్ రావడం చాలా సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రగతి వివరాల నివేదికను వివరించారు. సమావేశం అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 55 మంది ఉపాధ్యాయులను డాక్టర్ బండా ప్రకాష్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ , డీఈఓ వాసంతి శాలువాలు, ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని తెలియజేస్తూ పలువురు ఉపాధ్యాయులు స్ఫూర్తి గీతాలను ఆలపించారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హై స్కూల్ విద్యార్థినులు చేసిన స్వాగతం నృత్యం ఆకట్టుకుంది. ఈ సమావేశంలో మైనారిటీ కమిషన్ సభ్యులు దర్శన్ సింగ్, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానసరాంప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, పాఠశాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోతుల దాడిలో గాయపడి వారిని పరామర్శించిన గండ్ర



మొగుళ్ళపల్లి, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మొగుళ్ళపల్లి మండలం, పెద్దకొమటిపల్లి గ్రామ వాస్తవ్యులు గడ్డం నారాయణ, ముత్యాల కోశ్వర్ ల కోతుల దాడిలో గాయపడి చికిత్స అనంతరం కోలుకుంటున్న వారిని ఈ రోజు వారి ఇంటికి వెళ్ళి పరామర్శించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, అదే విదంగా ఆకినపల్లి గ్రామ వాస్తవ్యులు కీ.శే గండు లింగయ్య మరియు ఇస్సిపేట గ్రామ వాస్తవ్యులు కీ.శే పిన్నింటి లచ్చువమ్మ ఇటీవల మరణించగా నేడు వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. వారి వెంట మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పశువుల నిర్వహణను పరిశీలించిన ఫిలిప్పైన్స్ దేశస్థులు



జనగామ జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): శుక్రవారం లింగాల ఘనపూర్ మండలం లోని నవాబ్ పేట గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల నిర్వహణ తీరును పరిశీలించేందుకు పిలిపెన్స్ దేశానికి చెందిన డాక్టర్ ఫ్రాన్సిస్ డాక్టర్ లోవేల్ లు జనగామ జిల్లా అధికారులతో కలిసి పశువుల సంత ను సందర్శించారు. బ్యూరో ఆఫ్ ఎనిమల్ ఇండస్ట్రీ (బి. ఏ. ఐ.) ఆధ్వర్యంలో విదేశీ డాక్టర్లు పశువులు సంతను సందర్శించి నిర్వహిస్తున్న లావాదేవీలు పశు వైద్య ప్రజారోగ్య వ్యవస్థ లను గురించి జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక పశువు వ్యాధుల నియంత్రణ యాజమాన్య పద్ధతులు పశు రవాణాకు సంబంధించిన విధివిధానాలను, అందుకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను తెలుసుకొని సంతృప్తి చెందారు. ఈ పర్యటనలో ఆపేడా ఈజీఎం భారత దేశ పస్మాంస ఎగుమతి దారుల అధ్యక్షులు అఫ్జల్ అజీజ్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ రావు, డాక్టర్ దేవేందర్, డాక్టర్ భగవాన్ రెడ్డి, డాక్టర్ సాయి కార్తీక్, “అలన” పశు వైద్యశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గణనాధుని ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎస్సై దివ్య సాకపురం





కొత్తపల్లి గోరి, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి తోట్లవాడలో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ ని స్థానిక కొత్తపల్లి గోరీ ఎస్సై దివ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య ఎస్సై మాట్లాడుతూ ప్రజలందరి ఐక్యతతో జరిగే వినాయక నవరాత్రి ఉత్సవాలుగ్రామస్తులకు ఐక్యతను సంప్రదాయాలకు ప్రత్యేకంగా నిలుస్తాయని తెలిపారు. అందరూ శాంతి సౌభాగ్యాలతో గణపతి నవరాత్రి ఉత్సవాలను జరుపుకుంటూ విజయవంతం చేశారని ఆమె ఆకాంక్షించారు అనంతరం ఎస్సై దివ్య కు శాలువాతో సన్మానం చేశారు. కమిటీ సభ్యులు పిట్టల వికాస్. నేత చందు. వనం ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలనే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

### బిజెపి మండల అధ్యక్షుడు సూధనబోయిన విష్ణు యాదవ్



కొత్తపల్లి గోరి, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): స్వతంత్రం భారతంలో వచ్చిన విప్లవాత్మక పన్ను సంస్కరణలు నిత్యావసరాలు ఆహార పదార్థాల పై పన్ను 18శాతం,12శాతం నుంచి 5శాతం 0శాతం తగ్గింపు తీసుకురావడం అనేది గొప్ప ఆశించదగ్గ విషయమని ఈరోజు కొత్తపల్లి గోరి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగిందని కొత్తపల్లి గోరి మండల అధ్యక్షుడు సూధనబోయిన విష్ణు యాదవ్ అన్నారు అనంతరం ఆయనమాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలు, స్ప్రే పార్ట్స్, ఎరువుల పై 18శాతం 12 శాతంనుంచి 5శాతం కి తగ్గింపు ఆరోగ్య భీమా, జీవిత భీమా ప్రీమియం పై పన్ను 18 శాతం నుండి 0 శాతంకి తగ్గింపు దేశ ప్రజలకు దసరా దీపావళి కానుకగా సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి ప్రధానమంత్రి మోదీ ఆగస్ట్ 15 న స్వతంత్ర దినోత్సవ ప్రసంగంలో సూచనప్రాయంగా GST సంస్కరణల గురించి మాట్లాడటం జరిగింది. కానీ ప్రజలు ఊహించిన దానికరే తొందరగా ఊహించిన దానికరే గొప్పగా GST పన్ను తగ్గింపులు తీసుకువచ్చింది కేంద్ర ప్రభుత్వం అని ముఖ్యంగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ని దృష్టిలో పెట్టుకుని తీసుకువచ్చిన ఈ పన్ను తగ్గింపులు స్వతంత్ర భారతంలో వచ్చిన గొప్ప పన్ను సంస్కరణల్లో ఒకటిగా నిలబడుతుంది. గత బడ్జెట్లో ప్రవేశపెట్టిన 12 లక్షల వరకు వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపు కూడా మధ్యతరగతి వేతన జీవులకు ఒక వరం లాంటిదనీ

ఈ పన్ను సంస్కరణల వల్ల వచ్చే 5-6 నెలలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాల్లో కొంత కోత పడినా ఆ మొత్తం ప్రజలకు ఆదా అయి ఇతర అవసరాల కోసం వెచ్చించే అవకాశం ఉంటుందనీ ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం తద్వారా దేశంలో తయారీ రంగాన్ని , వ్యవసాయ రంగాన్ని, నిర్మాణ రంగాలను బలపరిచే లక్ష్యంగా తీసుకువచ్చిన ఈ పన్ను సంస్కరణలు దేశ ఆర్థిక వృద్ధికి దోహద పడతాయనడంలో సందేహం లేదనీ

ఈ విప్లవాత్మక సంస్కరణలు తెచ్చిన ప్రధాని మోడీకి ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ కరాబు బాపూరావు జవాజి ప్రభాకర్ నెల్లి వేణు దొంతుల నరేష్ చంద్రమౌళి అనిల్ కుమార్ రేగుల రవి చంద్రమౌళి బిల్లా రాకేష్ యోగి తనుగుల రమేష్ రవి తదితరులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తుకు దిక్సూచి ఉపాధ్యాయుడే

## జిల్లాలో ఘనంగా జరిగిన గురుపూజోత్సవం



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): జిల్లా విద్యాశాఖ అధికారి హెచ్ వి ఎన్ పి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్రావు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రంలో మన జిల్లా ఎస్ఎస్సి ఫలితాల్లో మొదటి స్థానం సాధించినందుకు ఉపాధ్యాయులు అందరికీ అభినందనలు తెలిపినారు. ఈరోజు సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ ఒక పుస్తకం మనసును మార్చగలదు. కానీ ఒక ఉపాధ్యాయుడు జీవితాన్ని మార్చగలడు. అని మన దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందని, విద్యార్థులను ఆ భవిష్యత్తుకు సిద్ధం చేసే శక్తి, ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, అందుకే ఉపాధ్యాయుల వృత్తి అత్యంత పవిత్రమైనది, ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పేవాడు మాత్రమే కాదు, ఆయన ఒక మార్గదర్శకుడు, ప్రేరణ శక్తి,సమాజ నిర్మాత, ఒక విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి, ఉపాధ్యాయుల కృషి ఎప్పుడూ ఉంటుందని , అందుకే ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించి, సమాజంలో ముందుకు నడవాలి అని తెలిపినారు.ముఖ్య అతిథి గౌరవ ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు, మాట్లాడుతూ మన మొదటి గురువు మన తల్లిదండ్రులు తరువాత ఉపాధ్యాయులు. ఉపాధ్యాయుల సేవలను గౌరవిస్తూ ఉన్నాను, ఉపాధ్యాయుడు విద్యార్థికి గురువు మాత్రమే కాక, మార్గదర్శకుడు, ప్రేరణ దాత కూడా, మీ అందరి నిబద్ధత, కృషి పట్ల నేను గర్విస్తున్నాను. భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దడంలో, మీ సేవలు చిరస్మరణీయం, విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దే మహత్తరశక్తి ఉపాధ్యాయులదే అని విద్యార్థులకు, శ్రేయోభిలాషులకు, సహకరించిన ఉపాధ్యాయులందరికీ, పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపిక చేయబడిన 12 మంది ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులను కలెక్టర్, ఎమ్మెల్సీ మరియు డిఈఓ సన్మానించినరు.

ఈ కార్యక్రమం లో శ్రీరాములు, అప్పారావు, సంతోష్, ఆజాద్, పూర్ణ చందర్, ఉమామహేశ్వర్, సతీష్, శ్రీనివాస్ మరియు వివిధ మండలాల ఎంఈఓ లు పాల్గొన్నారు.

# డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి: డివైఎఫ్ఐ



హనుమకొండ, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ కి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. హనుమకొండ, రాంనగర్, సుందరయ్య భవన్ లో డీఎస్సీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. ప్రతి సంవత్సరం మెగా డీఎస్సీ నిర్వహించి ఉద్యోగాలు భర్తీ చేస్తామనీ చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం హామీ నెరవేర్చడం లేదని, ఇప్పటికీ రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్ష మూడుసార్లు నిర్వహించిందని, గత సంవత్సరం డీఎస్సీ నిర్వహించి చేతులు దులుపుకుందని, అప్పుడే మరో ఆరు నెలలో డీఎస్సీ వేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పదోన్నతులు రావడం వలన రాష్ట్రంలో చాలా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయని, డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా వాటికి భర్తీ చేయాలని కోరారు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు ప్రకటన చేయడం లేదని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ ను ప్రకటించి రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రీ ప్రైమరీ టీచర్ పోస్టుల దరఖాస్తును తేదీని పొడిగించాలని, వాటినీ కూడా డిఎడ్ లేదా బీఈడీ చేసిన వారిని అర్హులుగా ప్రకటించాలి.ఈ సమావేశంలో డీఎస్సీ అభ్యర్థులు బోడ నర్సింగం, కాటా కృష్ణవేణి, వేణు, ప్రకాష్, బి. కళ్యాణి, లావణ్య, అనిత, తిరుపతి, బద్రి, రమేష్, కళ్యాణ్, ప్రసాద్ , రాకేష్, లు పాల్గొన్నారు.

# నియామక ఉత్తర్వులకై బయలుదేరిన జిపివోలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): జిల్లా నుండి ఎంపికైన గ్రామపాలన అధికారులు (జిపివోలు) కి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్ హైటెక్స్ లో నియామక ఉత్తర్వులు అందజేయనున్న నేపథ్యంలో, జిపిఓ అభ్యర్థులు హైదరాబాదు తరలివెళ్లే ప్రక్రియను ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా నుండి మొత్తం 107 మంది జిపివోలు ఎంపికయ్యారని, వారి సౌకర్యార్థం 2 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి హైదరాబాద్‌కు పంపుతున్నామని తెలిపారు. గణపురం, మహాదేవపూర్ నాయబ్ తహసీల్దార్లు లైజన్ అధికారులుగా వ్యవహరించనున్నారని, వారితో పాటు పోలీసు సిబ్బంది కూడా పర్యవేక్షణలో ఉంటారని తెలిపారు. నూతనంగా ఉద్యోగాల్లో చేరుతున్న సందర్భంగా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేస్తూ నేటి నుండి మీరు జిపివోలుగా బాధ్యతలు స్వీకరించబోతున్నారని, ఉద్యోగ జీవితంలో ప్రజల మన్ననలు పొందితే అదే ప్రతి ఉద్యోగి జీవితానికి లభించే గొప్ప మన్ననలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మురళీధర్, గణపురం, మహాదేవపూర్ మండలాల నాయబ్ తహసీల్దార్లు భాస్కర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# బోడ కాకర సాగును పరిశీలించిన జిల్లా ఉద్యానశాఖ అధికారి



రేకుమట్ల, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేకుమట్ల మండలం రాఘవరెడ్డి పేట గ్రామంకు చెందిన రైతు బి. మొగిలి కూరగాయల పందిరిలో బోడ కాకర సాగు చేపట్టారు. ఈ పందిరి సాగును జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎడ్ల సునీల్ కుమార్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందిరి విధానంలో సాగు చేయడం వలన పంటకు ఎండ, వర్షం, గాలి వంటి వాతావరణ మార్పుల ప్రభావం తక్కువగా ఉంటుందని, కీటకాలు, వ్యాధులు తక్కువగా రావడం వలన పురుగుమందుల ఖర్చు తగ్గుతుందని, సాధారణ సాగుతో పోలిస్తే 25%-%30 శాతం అధిక దిగుబడి వస్తుందని, పందిరిలో పండిన బోడ కాకర నాణ్యతతో ఉండి మార్కెట్లో మంచి ధర లభిస్తుందని తెలిపారు. అంతేకాక, ఆయన రైతులను పందిరి సాగు విధానాలను ప్రోత్సహిస్తూ ఉద్యాన శాఖ నుండి సబ్సిడీ, సాంకేతిక సహాయం అందుబాటులో ఉంటుందని వివరించారు. ముఖ్యంగా సన్న చిన్న కారు రైతులు పందిరి కూరగాయల నిర్మాణం చేపడితే, ఒక యూనిట్ (20 గుంటలు)కు రూ. 50,000 వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఒక రైతు గరిష్టంగా 5 యూనిట్ల వరకు ఈ రాయితీ పొందవచ్చని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

# సమ్మక్క సారలమ్మ దేవాలయంను సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎస్.పి

### కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం గద్దెల ప్రకారం విస్తరణ ప్రణాళికలు



ఎస్.ఎస్. తాడ్వాయి, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): శుక్రవారం ములుగు జిల్లా, ఎస్.ఎస్. తాడ్వాయి మండలం లోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. శబరిష్., కొత్త మాస్టర్ ప్లాన్ అమలు లో భాగంగా గద్దెల ప్రకారం విస్తరణ ప్రణాళికలకు దేవాదాయ శాఖ అధికారులతో పాటు, పోలీస్ అధికారులు భద్రతా ఏర్పాట్లకు అనుగుణంగా స్థలాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పి, శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం ప్రాంతం చుట్టూ కలియ తిరుగుతూ కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలు వరుస ప్రకారం విస్తరణ ప్రణాళికలు, సమ్మక్క సారలమ్మ తల్లుల దర్శనం కొరకు భక్తులు సౌలభ్యంగా క్యూలైన్ ల ఏర్పాటు, వి ఐ పి, వి వి ఐ పి ల, ఎంట్రి తదితర అంశాలను క్షుణ్ణంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, ములుగు డి.ఎస్.పి రవీందర్, దేవదాయ శాఖ డి ఈ సి హెచ్ రమేష్ బాబు, సంబంధిత అధికారులు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భావితరాల నిర్మాతలు ఉపాధ్యాయులు

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ములుగు జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): క్రీస్తు శేషులు, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతి సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని ములుగు జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ సిద్ధార్థరెడ్డి గారు అధ్యక్షత వహించగా, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి రేగ కళ్యాణి మరియు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంపత్ రావు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు భావితరాల నిర్మాతలు. వారి చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు, సమాజ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. మంచి సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలి అని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతమైన ములుగు జిల్లాలో అధిక సంఖ్యలో గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ సేవలందిస్తున్న ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయము. విద్యార్థుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలి అని అన్నారు. అనంతరం ములుగు జిల్లాలో 33 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అతిథుల చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిఇబి కార్యదర్శి ఈ.సూర్యనారాయణ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అర్షం రాజు, కాటం మల్లారెడ్డి, గుళ్లపెల్లి సాంబయ్య, మండల విద్యాధికారులు, అవార్డు గ్రహీతలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మరియు జిల్లా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా..

### చల్లా ధర్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే



పరకాల, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా నడికూడా మండలం రామకృష్ణాపురం గ్రామంలో ఇటీవలే వివిధ కారణాలతో మృతి చెందిన సింగిరెడ్డి ఇంద్ర,యార సంధ్యారాణి, ఎరుకల రాజు కుటుంబాలను పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి శుక్రవారం రోజున పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి మృతి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడుతున్న బిఆర్ఎస్ కార్యకర్తలు ఎరుకల కృష్ణమూర్తి, ఎరుకల శ్రీనివాస్, పెండ్లి సాయి లను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు తరలిన జిపిఓలు




ములుగు జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాకు సంబంధించి గ్రామ పంచాయతీ పాలన అధికారులు( జిపిఓలు) నియామక పత్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా  అందుకునేందుకు శుక్రవారం హైదరాబాద్ కు తరలి వెళ్లారు. హైదరాబాద్ లో నియామక పత్రాలను స్వీకరించేందుకు ములుగు కలెక్టరేట్ కార్యాలయం నుండి జిపిఓల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో జిల్లాకు సంబంధించిన 50 మంది జిపిఓ లు హైదరాబాద్ కు బయలుదేరారు.  అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, కలెక్టరేట్ కార్యాలయ పర్యవేక్షకులు శివకుమార్ పాల్గొన్నారు.

# ఆధార్‌లో ఏపీ అడ్రస్ ఉన్నా..



మొదటి పేజీ తరువాయి

మార్గదర్శకాల ప్రకారం, కేవలం ఆధార్ కార్డు మాత్రమే కాకుండా, తెలంగాణలో నివాసం ఉంటున్నట్లు రుజువు చేసే ఏ ఇతర గుర్తింపు కార్డునైనా చూపించి మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ విషయంపై గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ ఈడీ రాజశేఖర్ స్పష్టతనిచ్చారు.

**ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డులు:**

మహిళలు తమ ఆధార్ కార్డులో ఆంధ్రప్రదేశ్ చిరునామా ఉన్నప్పటికీ, కింద పేర్కొన్న వాటిలో ఏదైనా ఒక కార్డును చూపించి జీరో టికెట్‌పై ప్రయాణించవచ్చు.

**సూచించిన కార్డుల వివరాలు**

రేషన్ కార్డు, ఓటర్ కార్డు,  డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు

తెలంగాణలో నివాసం ఉన్నట్లు రుజువు చేసే ఇతర గుర్తింపు కార్డులు.

గతంలో సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో ఆధార్ కార్డులు పొంది, రాష్ట్ర విభజన తర్వాత కూడా వాటిలో చిరునామా మార్పు చేసుకోని మహిళలకు ఈ కొత్త నిర్ణయం ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారై ఉండి, ప్రస్తుతం తెలంగాణలో నివాసం ఉంటున్న మహిళలు కూడా దీనివల్ల లబ్ధి పొందుతారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా, అర్హత ఉన్న ప్రతి మహిళకు 'మహాలక్ష్మి పథకం' ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంది. ఈ సడలింపుతో మహిళల ప్రయాణ సౌలభ్యం మరింత పెరుగుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ కొత్త నియమాలు తక్షణమే అమల్లోకి వస్తాయి. సంబంధిత అధికారులందరికీ ఈ మార్పులపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయబడ్డాయి. మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది.

# రాష్ట్రంలో యూరియా సంక్షోభం

మొదటి పేజీ తరువాయి

ఫైర్ అయ్యారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు అనే విషయం అదే రాజ్యాంగంపై ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన రేవంత్ రెడ్డికి తెలియదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఓేసిన పాపానికి తమ చెప్పుతో తామే కొట్టుకునే దుస్థితి వచ్చిందని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతు లక్ష్మణ్ యాదవ్ తన గోసను వెల్లగక్కితే అక్రమ కేసుల పేరిట వేధిస్తారా? అని నిలదీశారు. యూరియా దొరకక కళ్లముందే పంట ఎండిపోవడంతో ఆక్రోశంలో మాట్లాడిన రైతుపై కక్షగట్టి అర్ధరాత్రి నుంచి పోలీసులను అతని ఇంటిపైకి పంపించి రైతు లక్ష్మణ్‌ను అతని కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తారా? అని ప్రశ్నించారు. దేశానికే అన్నం పేట్టే రైతుపై ఈ రకంగా అక్రమంగా కేసు బనాయించడం దుర్మార్గమైన చర్యే కాదు సీఎం దిగజారుడుతనానికి కూడా నిదర్శనమని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో బస్తా యూరియాకు దిక్కులేక అల్లాడుతున్న అన్నదాతలకు కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేదా? రాజ్యాంగాన్ని పట్టుకుని ఫోజులు కొట్టే రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పల్లెపల్లెనా ఈ సర్కార్‌పై దుమ్మెత్తిపోస్తున్న రైతులందరిని అరెస్టు చేయడానికి ఈ పోలీసులు సరిపోవని, రాష్ట్రంలో ఉన్న జైళ్లు కూడా సరిపోవన్నారు. కడుపు కాలిన తెలంగాణ రైతులతో పెట్టుకురే ఏం జరుగుతుందో రేవంత్ రెడ్డి, తన పాత గురువును అడిగి తెలుసుకురే మంచిదన్నారు. ఇకనైనా ఈ అక్రమ కేసులు బనాయించి అమాయక రైతు లక్ష్మణ్‌ను వేధించడం మానుకోకపోతే, అతనికి రక్షణ కవచంగా బీఆర్ఎస్ ఉంటదని హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్నదాతలను బీఆర్ఎస్ పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటదని భరోసా ఇచ్చారు.

# బీఆర్ఎస్‌లో కేసీఆరే సుప్రీం లీడర్

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): కల్వకుంట్ల కవిత ఆరోపణలపై పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు మాజీ మంత్రి హరీశ్ రావు. బీఆర్ఎస్ లో కేసీఆరే సుప్రీం లీడర్ అని కలిసి పనిచేయడం, ప్రజాసేవ చేయడమే కేసీఆర్ తమకు నేర్పించారని చెప్పారు. ఎవరి విషయంలోనైనా పార్టీదే తుది నిర్ణయమని అన్నారు హరీశ్. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్ రావు బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ నేతల మీట్ ది గ్రీట్ ప్రోగ్రామ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. మేడిగడ్డ 3 పిల్లర్లు కుంగితే రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. ఏడాదిన్నర నుంచి ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. వానాకాలంలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉండదని ఆసమయంలో బాహుబలి మోటార్లతో నీటిని ఎత్తిపోసుకోవచ్చని సూచించారు. హైడ్రాతో హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలిందన్నారు. ఎన్ఆర్ఐలు పెట్టుబడులు పెట్టడం లేదని విమర్శించారు హరీశ్ రావు. కాగా బీఆర్ఎస్ పార్టీలో హరీశ్‌రావు, సంతోష్‌రావు అవినీతి అనకొండలు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించిన సంగతి తెలిసిందే కేసీఆర్ ప్రస్తుత దుస్థితికి హరీశ్‌రావు, సంతోష్‌రావుతోపాటు మేఘా కృష్ణారెడ్డి కారణమని ఆరోపించారు. వాళ్ల వల్లే కేసీఆర్‌కు అవినీతి మరకలు అంటాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పేరు చెప్పుకొని వారు లబ్ధి పొందారని, వాళ్ల వల్లే కేసీఆర్ బద్నాం అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు కవిత.

# తండ్రిని అబాస్‌పాలు చేస్తున్న కవిత

**కడిగిన ముత్యం నిప్పు కనిక లాంటివారు హరీష్ రావు**

**కవితకు మతిభ్రమించి హరీష్ రావు పైన అనుచిత వాక్యాలు**

**జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు**

**ఏలేటి వెంకట్ రెడ్డి ఎఫ్.పి.ఓ మండల చైర్మన్**



చిన్నకోదూర్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): తండ్రిపై ప్రేమను చూపుతోనే కేసీఆర్ ని ప్రజల్లో అభాస్పాలు చేస్తున్న విషయాన్ని కవిత మర్చిపోయి కడిగిన ముత్యం లాంటి వ్యక్తి నిప్పులాంటి వ్యక్తి హరీష్ అన్న పైన అనుచిత వాక్యాలు చేయడము కవితకు పిచ్చి లేచినట్లుగా అనిపిస్తుంది అని బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఎఫ్.పి.ఓ మండల చైర్మన్ ఏలేటి వెంకట్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం నాడు ప్రెస్ నోట్ విడుదల చేసిన సందర్భంగా జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఏలేటి వెంకట్ రెడ్డిలు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీని పూర్తిగా నాశనం చేయడానికి కవిత పూనుకున్నదని బిఆర్ఎస్ పార్టీ పురుడు పోసుకున్నప్పుడు కవిత ఎక్కడున్నదో ఆలోచన చేసుకోవాలని కేసీఆర్ ఉద్యమాన్ని చేపట్టిన నాటినుండి ఆయనకు అంతరాత్మగా హరీష్ రావు ఉంటూ పార్టీని బలోపేతం చేస్తూనే రాష్ట్ర సాధనలో పోరాటం చేస్తూ పార్టీ బలోపేతం చేసిన మహావీరుడు హరీష్ రావుని అన్ని రకాలుగా పార్టీ బలోపేతమైన తరువాత ఉద్యమంలోకి వచ్చిన కవిత ఇవ్వాలా తండ్రిని పార్టీని నాశనం చేసే విధంగా మాట్లాడడం సరికాదని ఇప్పటికే కవిత వల్లన పార్టీ ప్రభుత్వాన్ని కోల్పోయిందని ఇప్పుడు పార్టీ ఏ లేకుండా చేయడానికి ఇలాంటి వాక్యాలకు పూనుకుంటుందని అన్నారు. కవిత నడవడిక తన జాగృతి సీనియర్ నాయకులకే నచ్చడం లేదని వారు కూడా ఈ రోజు కవితకు దూరం ఉంటున్నారరే కవిత మనస్తత్వం ఎలాంటిదో అర్థమవుతుందని ఎవరో చెప్పిన ఆశలకు పోయి పార్టీని నాశనం చేస్తాం అనుకోవడం హరీష్ రావుపైన అనుచిత వాక్యాలు చేయడము దింపుడు గల్లం లాంటి ఆశేనని వారు అన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని బహిరంగంగా హరీష్ అన్నకు క్షమాపణ చెప్పి పక్కకురే కవితకు మంచిదని వారు సూచించారు ఇట్టి కార్యక్రమంలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఏలేటి వెంకట్ రెడ్డి కారోబార్ నరసింహారెడ్డి జాలపల్లి దుర్గారెడ్డి కోనేటి మహేష్ లు ఉన్నారు.

# జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం

వరంగల్ జిల్లా, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): పాఠశాల విద్యాశాఖ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉర్సుగుట్ట ప్రాంతం లోగల ఆకుతోట కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చెందిన గురుపూజోత్సవం మరియు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య నగర మేయర్ గుండు సుధారాణి నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి జిల్లా కలెక్టర్ డా.సత్య శారద. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అతిథులు, అనంతరం జిల్లా పరిధి లో ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి డి ఆర్ ఓ విజయ లక్ష్మి ఇంచార్జి డి ఆర్ డి ఏ రామిరెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు









# కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్ భారీ సభ

**స్థానిక సంస్థల ఎన్నికల ముందు కాంగ్రెస్ వ్యూహం**

**15న లక్ష మందితో సభకు ఏర్పాట్లు**




హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అధికార కాంగ్రెస్ వేగంగా అడుగులు ముందుకు వేస్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే బీసీ రిజర్వేషన్లపై కేంద్రం స్పందన రాకపోయినప్పటికీ తాము 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కేటాయిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్ ప్రకటించిన సందర్భంగా సభ లక్ష మందితో సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 15న కామారెడ్డిలో భారీ సభకు ఏర్పాటు చేయాలని జిల్లా మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తుంది. అయితే ఈ సభ అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# కాళేశ్వరంపై రేవంత్ ప్రభుత్వం రాద్ధాంతం :హరీష్ రావు

**కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనకబడిందని విమర్శ**

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ మూడు పిల్లర్లు కుంగితే ప్రభుత్వం పెద్ద రాద్ధాంతం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న ఆయన ప్రవాస బీఆర్ఎస్ నేతలు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ఏడాదిన్నర నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఇక వానాకాలంలో కరెంట్ డిమాండే ఉండదని ఈ సమయంలోనే బాహుబలి మోటార్లతో నీటిని రిజర్వాయర్లలోకి ఎత్తిపోసుకోవచ్చని అన్నారు. హైడ్రా వల్ల హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ పూర్తిగా కుప్పకూలిందని హరీశ్ రావు కామెంట్ చేశారు. అందుకే రాష్ట్రంలో ఎన్నారైలు పెట్టుబడులు పేట్టేందుకు సుముఖంగా లేరని ఆరోపించారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీదే విజయం రాసిపెట్టుకోండని కామెంట్ చేశారు. రాష్ట్ర అభ్యున్నతికి పాటు పడాల్సిన ప్రభుత్వం కమిషన్లు, ఎక్వైరీలు అంటూ కాలం గడుపతోందని అన్నారు. ఏ పని చేయకుండా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి పాలన చూశాకే ప్రజలకు కేసీఆర్ విలువ ఏంటో తెలిసిందని అన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా అవినీతి రాజ్యమేలుతోందని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ వెనకబడిందని కామెంట్ చేశారు.



# క్యాన్సర్ రిస్క్ తగ్గించే పాల పదార్థాలు

ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తోన్న మరణాలకు రెండవ ప్రధాన కారణం క్యాన్సర్. దీనిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వల్ల వచ్చే మరణాలు అధికంగా ఉన్నాయి. 2022 నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 9.7 మిలియన్ల మరణాలకు క్యాన్సర్ కారణమైంది. అయితే, ఈ క్యాన్సర్ ప్రమాదాన్ని మనం తినే సాధారణ ఆహారం ద్వారానే తగ్గించుకునే అవకాశం ఉందని మీకు తెలుసా?

పండ్లు, కూరగాయలు, వీటితోపాటు మరికొన్ని ఆహారాలకు క్యాన్సర్ ప్రమాదాల్ని తగ్గించగలిగే శక్తి ఉంది. వీటిలో పాల ఉత్పత్తులు కీలకమైనవి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలతో పాటు, సాంప్రదాయ పాల పదార్థాలను ఆహారంలో చేర్చడం వల్ల కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని అధిగమించొచ్చు. భారతీయులు అధికంగా వాడే ఆ మిల్క్ ప్రొడక్ట్స్ ఏంటో చూద్దాం.



**1. పెరుగు :**

పెరుగులో ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో మంచి బ్యాక్టీరియా ఉంటుంది. ఇది ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఫలితంగా ప్రేగులు ఆరోగ్యకరంగా ఉంటాయి. మెరుగైన రోగనిరోధక శక్తిని పెరుగు కల్గిస్తుంది. జీర్ణక్రియను చక్కబరుస్తుంది. పెద్దప్రేగు క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో పెరుగు ముఖ్య పాత్ర పోషిస్తుంది.

**2. మజ్జిగ:**

మజ్జిగ మన భారతీయ ఇళ్లలో అత్యంత ప్రధానమైనది. ఇందులో కొవ్వు తక్కువగా ఉంటుంది. మజ్జిగలో ప్రోబయోటిక్స్, కాల్షియం, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. మజ్జిగలో జీర్ణక్రియకు సహాయపడే లక్షణాలున్నాయి. ఇది కడుపు మంటను తగ్గిస్తుంది. క్యాన్సర్ కలిగించే కారకాల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.

**3. పనీర్ :**

పనీర్ అనేది కాల్షియం, సెలీనియంతో కూడిన ప్రోటీన్-రిచ్ డైరీ ఫుడ్. సెలీనియం యాంటీఆక్సిడెంట్ లక్షణాలకు ప్రసిద్ధి. ఇది కణాలను ఆక్సీకరణ నష్టం నుండి రక్షిస్తుంది. ఇది క్యాన్సర్ నివారణలో చాలా సహాయకారి.

**4. నెయ్యి, వెన్న :**

మితంగా తీసుకుంటే, నెయ్యి మీకు సంయోగ లినోలెయిక్ ఆమ్లం (%జూూ%) ఇస్తుంది. ఇది క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది శరీరంలోని పోషకాల్ని మెరుగుపరు-స్తుంది. తద్వారా శరీరం క్యాన్సర్-రక్షిత విటమిన్లు, ఖనిజాలను ఎక్కువగా ఉపయోగించుకోవడంలో సహాయపడుతుంది.

**5. పాలు:**

పాలలో కాల్షియం, విటమిన్ డి సహజంగా ఉంటుంది. ఈ రెండూ ఎముకల ఆరోగ్యానికి, క్యాన్సర్ నివారణకు చాలా ముఖ్యం. కొలొరెక్టల్ క్యాన్సర్ నిర్మూలనకు ఎంతో ఉపయుక్తం. ఆవు పాలను మితంగా తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు, మొత్తం ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో ఎంతో దోహదం చేస్తుంది.

# బీమాపై భారం తగ్గేది కొంతే..




అన్ని రకాల జీవిత, ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంపై పన్నును జీఎస్టీ పాలకమండలి పూర్తిగా ఎత్తేసింది. దీంతో పాలసీ ధరలు దిగిరానున్నాయి. పాలసీ కొనుగోలుదారులకు ఇది శుభవార్త అని, పాలసీ కొనుగోళ్ల దిశగా ప్రజలను ప్రోత్సహించినట్టు అవుతుందని బీమా సంస్థల వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, జీఎస్టీని రద్దు చేయడం వల్ల పాలసీ కొనుగోలుదారులకు పూర్తి ప్రయోజనం దక్కుతుందా? అంటే ప్రస్తుతానికి కాదు అనే సమాధానమే వస్తుంది. బీమా కంపెనీలు చేసే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్‌లే ఇందుకు కారణమని బీమా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. బీమా పాలసీ కొనుగోలుపై ప్రస్తుతం 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్నారు. అంటే ఏదైనా ఓ బీమా ప్రీమియం ధర రూ.10వేలు అయితే పాలసీ కొనుగోలుదారు 18 శాతం జీఎస్టీ కలుపుకొని రూ.11,800 చెల్లించాలి. పాలసీ కొనుగోలుదారు నుంచి జీఎస్టీ కింద వసూలు చేసిన సొమ్మును బీమా సంస్థలు ప్రభుత్వానికి చెల్లిస్తాయి. దానికంటే ముందు బీమా సంస్థ తాను అప్పటికే ప్రభుత్వానికి చెల్లించిన జీఎస్టీని లెక్కించి మిగిలిన మొత్తాన్ని మాత్రమే చెల్లిస్తుంది. దీనినే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ) క్లెయిమ్ అంటారు. బీమా సంస్థలు సేవా రంగంలోకి వస్తాయి. కార్యాలయాల అద్దె, సాఫ్ట్‌వేర్ లైసెన్సులు, ప్రచారం, మార్కెటింగ్, ఆడిటింగ్ వంటి వాటికి జీఎస్టీని చెల్లిస్తాయి. ఈ మొత్తాన్ని ఐటీసీ కింద క్లెయిమ్ చేసుకుంటాయి. ఇప్పుడు పాలసీ కొనుగోళ్లపై జీఎస్టీని ఎత్తేయడంతో ఐటీసీ భారా న్ని బీమా సంస్థలు పాలసీ కొనుగోలుదారులపై వేసే అవకాశం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం, బీమా సంస్థల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

# క్షేమంగా వెళ్లిరండి..!



వానాకాలం ప్రయాణాలు.. కొందరికి ఉత్సాహాన్ని అందిస్తాయి. మరికొందరిని అనారోగ్యాల బారిన పడేస్తాయి. మరీ ముఖ్యంగా.. గర్భిణులను మరింత ఇబ్బంది పెడుతాయి. ఈ సమయంలో వాళ్లు అత్యంత జాగ్రత్తగా మెలగాలని గైనకాలజిస్టులు సూచిస్తున్నారు. ప్రయాణాలు సాఫీగా సాగాలంటే.. కింది జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.

**డాక్టర్ సలహా మేరకు:**

గర్భిణులు ప్రయాణాలు చేసేముందు గైనకాలజిస్టును కలవడం తప్పనిసరి. మొదటి, చివరి త్రైమాసికంలో ప్రయాణాలను విరమించుకోవడమే ఉత్తమం. గర్భధారణ సమస్యలు ఉన్నప్పుడు ప్రయాణాలు రద్దు చేసుకోవాలి. గర్భిణులు ఎక్కడికి వెళ్లినా మెడికల్ రిపోర్టులు, అత్యవసర ఫోన్ నంబర్లను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలి.

**సరైన రవాణా:**

వానాకాలంలో రైళ్లు, బస్సుల్లో ప్రయాణించడం ఇబ్బందికరం. విమానంలో ప్రయాణించేటప్పుడు ఎయిర్‌లైన్స్ నిబంధనలను తప్పకుండా తెలుసుకోవాలి. గర్భం దాల్చిన 36 వారాల తరువాత విమానంలో ప్రయాణించకపోవడమే మంచిది. సొంత వాహనాల్లో వెళ్లడమే సురక్షితం.

**ముందే తెలుసుకోండి:**

ప్రయాణాలకు సిద్ధమయ్యే ముందే.. వాతావరణ పరిస్థితులను తెలుసుకోండి. వెదర్ యాప్స్, వెబ్‌సైట్లను పరిశీలించండి. భారీ వర్ష సూచనలు ఉన్నప్పుడు ప్రయాణం వాయిదా వేసుకోవడమే మంచిది.

**సౌకర్యంగా ఉండండి:**

వదులుగా ఉండే కాటన్ దుస్తులు వేసుకోవడం వల్ల.. ప్రయాణాల్లో సౌకర్యవంతంగా ఉంటుంది. వాటర్‌ప్రూఫ్ జాకెట్లు, గొడుగు కూడా వెంట ఉంచుకోవాలి. తడిగా ఉన్న చోట జారి కిందపడిపోకుండా.. యాంటి స్లిప్ చెప్పులు వాడండి.

**శుభ్రత పాటించాల్సిందే:**

వానాకాలంలో ఎక్కువగా మూత్రాశయ ఇన్ఫెక్షన్లు, జీర్ణ సంబంధ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే, పరిశుభ్రత తప్పకుండా పాటించాలి. చేతులు శుభ్రం చేసుకోవడానికి శానిటైజర్లు, టవల్స్, టిష్యూలు, టాయిలెట్ సీట్ డిస్ ఇన్‌ఫెక్టెంట్ స్ప్రే వెంట ఉంచుకోండి. పబ్లిక్ టాయిలెట్లకు వీలైనంత దూరంగా ఉండండి.

**సమతుల ఆహారం:**

వానాకాలంలో బయటి ఆహారం తినకపోవడం మంచిది. ముందుగానే కోసిపెట్టుకున్న పండ్లు, సలాడ్లు, మూతలేకుండా ఉంచిన ఆహారం తినడం మంచిది కాదు. నూనె, మసాలాలు, ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తింటే.. లేనిపోని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఛాతీలో మంట, అజీర్ణం వంటివి ఇబ్బంది పెడతాయి. పరిశుభ్రమైన వాతావరణంలో చేసిన ఆహారాన్ని మాత్రమే తీసుకోండి.

# మీ కళ్లు పసుపు రంగులోకి మారాయా..?

## అయితే కేవలం కామెర్లు మాత్రమే కాదు, ఇవి కూడా కారణాలు కావచ్చు..!



పచ్చ కామెర్లు ఉన్నవారికి సహజంగానే కళ్లు పసుపు రంగులో మారి కనిపిస్తాయి. అలాగే శరీరం కూడా పసుపు రంగులోకి మారుతుంది. అయితే కళ్లు పసుపు రంగులో ఉన్నంత మాత్రాన కేవలం పచ్చ కామెర్లు వచ్చాయని కాదు. ఇందుకు ఇంకా అనేక కారణాలు కూడా ఉంటాయి. కళ్లు పసుపు రంగులోకి మారేందుకు రక్తంలో ఉండే బైలిరుబిన్ అనే వర్ణం ద్రవ్యం కారణం. కానీ కేవలం ఇదే కాదు, ఇంకా అనేక కారణాల వల్ల ఇలా కళ్లు పసుపు రంగులోకి మారుతుంటాయి. బైలిరుబిన్ అనేది మన శరీరంలో సహజంగా ఉత్పత్తి అవుతుంది. ఎర్ర రక్త కణాలు విచ్ఛిన్నం అవడం వల్ల ఇలా జరుగుతుంది. ఆరోగ్యవంతమైన లివర్ బైలిరుబిన్‌ను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేసి శరీరం నుంచి బయటకు పంపిస్తుంది. అయితే బైలిరుబిన్ నిల్వలు శరీరంలో మరీ అతిగా పేరుకుపోతే అప్పుడు శరీరంతోపాటు కళ్లు కూడా పసుపు రంగులోకి మారి కనిపిస్తాయి. దీన్నే పచ్చ కామెర్లు అంటారు.

**లివర్ సమస్యలు ఉంటే..**

బైలిరుబిన్ ను లివర్ సరిగ్గా బయటకు పంపలేకపోతే అప్పుడు ఆ వర్ణ ద్రవ్యం స్థాయిలు శరీరంలో పెరిగిపోతాయి. దీని వల్ల శరీరం, కళ్లు పసుపు రంగులోకి మారుతాయి. లివర్ సమస్యలు ఉన్నవారిలో ఇలా జరుగుతుంది. కనుక కళ్లు పసుపు రంగులోకి మారాయంటే అది పచ్చ కామెర్లు మాత్రమే కాదు, ఇంకా ఏదో కారణం ఉండి ఉంటుందని గుర్తించాలి. వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకుని ఆ కారణానికి తగినట్లు చికిత్స తీసుకోవాలి. హెపటైటిస్ అనే వ్యాధి పలు రకాలుగా ఉంటుంది. లివర్ వాపులకు గురి కావడం వల్ల ఇది వస్తుంది. హెపటైటిస్ ఎ, బి, సి అనే మూడు రకాల వైరస్ ఇన్‌ఫెక్షన్ల వల్ల లివర్ వాపులకు గురవుతుంది. కనుకనే దీన్ని హెపటైటిస్ అంటారు. ఇది ఒక ఆటో ఇమ్యూన్ వ్యాధి. అంటే శరీర రోగ నిరోధక కణాలు లివర్ కణాలపై దాడి ప్రారంభిస్తాయి. దీంతో లివర్ పనితీరు మందగిస్తుంది. ముఖ్యంగా మద్యం అధికంగా సేవించే వారిలో ఇలా జరుగుతుంది. కనుక కళ్లు పసుపు రంగులోకి మారాయంటే పచ్చ కామెర్లు కారణం కాకపోవచ్చు, మద్యం అతిగా సేవిస్తున్నారేమో గుర్తించాలి. మద్యం తాగడం మానేస్తే లివర్ దానంతట అదే పునరుత్తేజం చెంతుంది. దీంతో కళ్లు తిరిగి సాధారణ రంగులోకి మారుతాయి.

**మద్యం అతిగా సేవించడం వల్ల..**

మద్యం అతిగా సేవించడం వల్ల కొందరికి ప్రారంభంలో కళు పసుపు రంగులోకి మారకపోయినా దీర్ఘకాలంలో అది లివర్‌పై ప్రభావం చూపిస్తుంది కనుక దాని కారణంగా లివర్ సిర్రోసిస్ అనే వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి ఉన్నవారిలో కూడా కళ్లు పసుపు రంగులోకి మారుతాయి. అలాగే లివర్ క్యాన్సర్ ఉన్నా కూడా కళ్లు ఆ రంగులో కనిపిస్తాయి. పిత్తాశయంలో పైత్య రసంతోపాటు బైలిరుబిన్ కూడా నిల్వ ఉంటుంది. అయితే దీర్ఘకాలంలో పిత్తాశయంలో రాళ్లు తయారయ్యేందుకు కూడా వాటి అధిక నిల్వలు కారణం అవుతాయి. కనుక కళ్లు పసుపు రంగులో ఉన్నాయంటే పిత్తాశయంలో రాళ్లు ఉండడం కూడా ఒక కారణం కావచ్చు. ఈ సమస్య ఉన్నవారికి పిత్తాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి.

**ఎర్ర రక్త కణాలు..**

శరీరంలో ఎర్ర రక్త కణాలు మోతాదుకు మించి విచ్ఛిన్నం అయితే అప్పుడు బైలిరుబిన్ రక్తంలో అధికంగా పేరుకుపోతుంది. దీన్ని లివర్ వేగంగా బయటకు పంపించలేదు. దీంతో బైలిరుబిన్ స్థాయిలు అధికంగా పెరిగి అప్పుడు కళ్లు, శరీరం పసుపు రంగులోకి మారుతాయి. ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి అయ్యే రేటు కన్నా విచ్ఛిన్నం అయ్యే రేటు మరీ ఎక్కువగా ఉంటే ఆ స్థితిని హెమోలైటిక్ అనీమియా అంటారు. ఈ స్థితిలో కూడా కళ్లు పసుపు రంగులోకి మారుతాయి. కొందరికి మలేరియా జ్వరం కారణంగా ఎర్ర రక్త కణాలు వేగంగా విచ్ఛిన్నం అవుతాయి. కనుక మలేరియా వచ్చిన వారిలోనూ అప్పుడప్పుడు కళ్లు పసుపు రంగులో కనిపిస్తాయి. ఇలా కళ్లు పసుపు రంగులో కనిపించేందుకు అనేక కారణాలు ఉంటాయి. కనుక ఈ సమస్యను కేవలం పచ్చ కామె-ర్లుగా భావించకూడదు. మీకున్న అనారోగ్య సమస్య లక్షణాలను బట్టి వైద్యులకు చెబితే వారు పరీక్షలు చేసి మీకు కళ్లు అలా ఎందుకు మారాయో నిర్ధారిస్తారు. అప్పుడు కచ్చితమైన చికిత్స తీసుకుని ప్రాణాలను నిలబెట్టుకునే అవకాశం ఉంటుంది.



# చరిత్ర సృష్టించిన సబలెంకా

## ఫైనల్‌కు దూసుకెళ్లిన అరీనా సబలెంకా

ప్రతిష్టాత్మక టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో టాప్ సీడ్ బెలారస్ బ్యూటీ అరీనా సబలెంకా ఫైనల్‌కు దూసుకెళ్లింది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారు జామున జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో టాప్ సీడ్ అరీనా సబలెంకా 4-6, 6-3, 6-4 తేడాతో నాలుగో సీడ్ జెస్సికా పెగులాను ఓడించింది. ఈ గెలుపుతో వరుసగా మూడు సార్లు యూఎస్ ఓపెన్ ఫైనల్ చేరిన ప్లేయర్‌గా సబలెంకా రికార్డ్ నమోదు చేసింది. 2023, 2024తో పాటు తాజా ఎడిషన్‌లోనూ సబలెంకా ఫైనల్ చేరింది. గతేడాది జరిగిన ఫైనల్లోనూ పెగులాను సబలెంకా చిత్తు చేసింది. మరోసారి పెగులాపై పై చేయి సాధించింది. ఫైనల్లో విజయం సాధిస్తే యూఎస్ ఓపెన్‌లో హ్యాట్రిక్ టైటిల్స్ గెలిచిన రెండో ప్లేయర్‌గా నిలుస్తుంది. 2012-2014 మధ్య అమెరికా స్టార్ సెరెనా విలియమ్స్ వరుసగా మూడు టైటిళ్లు గెలిచింది. పెగులాతో 2 గంటల 40 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో సబలెంకా తొలి సెట్‌ను కోల్పోయింది. ఈ సెట్‌లో సబలెంకా అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. రెండో సెట్‌లో పుంజుకున్న ఈ వరల్డ్ నెంబర్ 1 ప్లేయర్..తనకే సాధ్యమైన పవర్‌ఫుల్ గేమ్‌తో పెగులాను ఒత్తిడిలోకి నెట్టింది. చివరి వరకు ఆధిక్యం కాపాడుకొని సెట్‌ను సొంతం చేసుకుంది. ఆఖరి సెట్‌లో బ్రేక్ పాయింట్స్ సాధించిన సబలెంకా సునాయస విజయాన్నందుకొని ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో సబలెంకా 8 ఏస్‌లతో పాటు 43 విన్నర్లు కొట్టగా.. నాలుగు డబుల్ ఫాల్ట్స్ చేసింది. 7 బ్రేక్ పాయింట్స్ అవకాశాలు రాగా.. మూడింటిని ఖాతాలో వేసుకుంది. మరోవైపు పెగులా 3 ఏస్‌లతో పాటు 21 విన్నర్లు కొట్టింది. 4 డబుల్ ఫాల్ట్స్‌తో పాటు 32 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. 7 బ్రేక్ పాయింట్స్ అవకాశాల్లో రెండింటిని మాత్రమే సొంతం చేసుకుంది. సబలెంకా మొత్తం 90 పాయింట్స్ రాబట్టగా.. పెగులా 88 పాయింట్స్‌కే పరిమితమైంది. సబలెంకా 16 గేమ్స్ గెలిస్తే.. పెగులా 13 గేమ్స్ గెలిచింది. ఆదివారం జరిగే ఫైనల్లో సబలెంకా.. అమెరికా స్టార్ అమాండా అనిసిమోవాతో తలపడనుంది.

# ప్రపంచకప్ 2027 నుంచి ఇంగ్లండ్ ఔట్..?



ఒకప్పుడు వన్డే క్రికెట్‌లో తిరుగులేని ఆధిపత్యం చూపించిన ఇంగ్లండ్ జట్టు ఇప్పుడు కష్టాల్లో పడింది. 2019లో వన్డే ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించిన ఇంగ్లండ్, 2027లో జరగబోయే ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించలేని ప్రమాదంలో చిక్కుకుంది. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో దారుణంగా పడిపోవడమే దీనికి ప్రధాన కారణం. 2023లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ ప్రదర్శన అందరినీ నిరాశపరిచింది. ఆ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఇంగ్లండ్, లీగ్ దశలోనే నిష్క్రమించింది. ఆ తర్వాత కూడా వన్డే క్రికెట్‌లో చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోయింది. దీని ఫలితంగా ఐసీసీ వార్షిక వన్డే ర్యాంకింగ్స్‌లో ఆ జట్టు ఎనిమిదో స్థానానికి పడిపోయింది. 2027 ప్రపంచకప్ ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వే ఆటోమేటిక్‌గా అర్హత సాధిస్తాయి. వాటితో పాటు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-8లో నిలిచిన జట్లు నేరుగా క్వాలిఫై అవుతాయి. ప్రస్తుతం ఇంగ్లండ్ ఎనిమిదో స్థానంలో ఉన్నప్పటికీ, జింబాబ్వే, దక్షిణాఫ్రికాకు ఆతిథ్యం హోదాలో స్థానం కల్పిస్తే, ఇంగ్లండ్ తొమ్మిదో స్థానానికి పడిపోతుంది. దీంతో నేరుగా ప్రపంచకప్‌కు అర్హత లభించదు. ఇంగ్లండ్ ఆటగాళ్లు టెస్టు, టీ20 ఫార్మాట్‌లకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారని, వన్డే క్రికెట్‌పై దృష్టి పెట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఒక సంవత్సరంలో ఇంగ్లండ్ కేవలం మూడు వన్డేలు మాత్రమే గెలిచి, పేలవమైన గెలుపు/ఓటమి నిష్పత్తిని నమోదు చేసుకుంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, ఇంగ్లండ్ 2027 ప్రపంచకప్‌లో చోటు కోసం క్వాలిఫయర్స్ ఆడాల్సి వస్తుంది. ప్రపంచ క్రికెట్‌లో ఒకప్పుడు నెంబర్ వన్ జట్టుగా వెలిగిన ఇంగ్లండ్ ఇప్పుడు ఎదుర్కొంటున్న ఈ సంక్షోభం, అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. జట్టు యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకుని, ఆటగాళ్లలో వన్డే క్రికెట్‌పై ఆసక్తి పెంచడం అవసరం. లేకపోతే, ఇంగ్లండ్ క్రికెట్ చరిత్రలో ఇది ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# ఇంగ్లాండ్‌లో దక్షిణాఫ్రికా తొలి వన్డే సిరీస్ విజయం

## 27 సంవత్సరాల తర్వాత తొలిసారిగా గెలుపు




దక్షిణాఫ్రికా జట్టు ఇంగ్లాండ్ గడ్డపై చరిత్ర సృష్టించింది. 27 సంవత్సరాలలో తొలిసారిగా, దక్షిణాఫ్రికా ఇంగ్లాండ్ గడ్డపై వన్డే సిరీస్‌ను గెలుచుకుంది. టెంబా బావుమా కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు ఈ గొప్ప ఘనతను సాధించింది. లార్డ్స్‌లోని చారిత్రాత్మక మైదానంలో జరిగిన రెండవ వన్డే మ్యాచ్‌లో, దక్షిణాఫ్రికా ఇంగ్లాండ్‌ను 5 పరుగుల తేడాతో ఓడించి ఉత్కంఠభరితమైన విజయాన్ని నమోదు చేసింది. దీంతో, దక్షిణాఫ్రికా మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో ఉంది. లీడ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌ను దక్షిణాఫ్రికా 7 వికెట్ల తేడాతో గెలుచుకుంది. 1998 తర్వాత ఇంగ్లాండ్‌లో దక్షిణాఫ్రికా సాధించిన తొలి వన్డే సిరీస్ విజయం ఇది. 27 సంవత్సరాల తర్వాత తొలిసారిగా ఇంగ్లాండ్ గడ్డపై దక్షిణాఫ్రికా ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను గెలుచుకోవడానికి నాయకత్వం వహించిన కెప్టెన్‌గా టెంబా బావుమా ఇప్పుడు నిలిచాడు. దక్షిణాఫ్రికా చివరిసారిగా 1998లో ఆడమ్ హొలియోకే జట్టును 2-1 తేడాతో ఓడించి ఇంగ్లాండ్‌లో వన్డే సిరీస్‌ను గెలుచుకుంది. ఈ ప్రస్తుత విజయానికి ముందు ఆ జట్టు 2008, 2012, 2017, 2022లో ఇంగ్లాండ్ చేతిలో నాలుగు వన్డే సిరీస్‌లను కోల్పోయారు. మే 1998లో ఇంగ్లాండ్ గడ్డపై జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను ఇంగ్లాండ్ 2-1 తేడాతో గెలుచుకుంది. ఆ సిరీస్‌లోని మొదటి రెండు మ్యాచ్‌లను దక్షిణాఫ్రికా గెలుచుకుంది. ఆ తర్వాత చివరి మ్యాచ్‌ను ఏడు వికెట్ల తేడాతో గెలుచుకోవడం ద్వారా ఇంగ్లాండ్ తన గౌరవాన్ని కాపాడుకుంది. ఇంగ్లాండ్ జట్టు మరోసారి దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌ను తన సొంత మైదానంలో కోల్పోయింది. ఇప్పుడు సిరీస్‌లోని మూడవ మ్యాచ్‌ను గెలవడం ద్వారా తన గౌరవాన్ని కాపాడుకునే అవకాశం ఉంది. సిరీస్‌లోని చివరి మ్యాచ్ సెప్టెంబర్ 7న సౌతాంప్టన్‌లో జరుగుతుంది. గురువారం రాత్రి లండన్‌లో ముగిసిన రెండో వన్డే మ్యాచ్ గురించి మాట్లాడుకుంటే, టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన దక్షిణాఫ్రికా జట్టు 8 వికెట్ల నష్టానికి 330 పరుగులు చేసింది. ఐడెన్ మార్క్రామ్, ర్యాన్ రికెల్టన్ జట్టుకు గొప్ప ఆరంభాన్ని ఇచ్చారు. ఇద్దరు బ్యాట్స్‌మెన్‌ల మధ్య 13.1 ఓవర్లలో 73 పరుగుల భాగస్వామ్యం ఉంది. రికెల్టన్ 33 బంతుల్లో 35 పరుగులు చేసి పెవిలియన్‌కు తిరిగి వచ్చాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ టెంబా బావుమా కేవలం నాలుగు పరుగులు చేసి ఔటయ్యాడు. ఐడెన్ మార్క్రామ్ 64 బంతుల్లో ఒక సిక్స్, ఆరు ఫోర్ల సహాయంతో 49 పరుగులు చేశాడు. గొప్ప ఆరంభం ఉన్నప్పటికీ, దక్షిణాఫ్రికా జట్టు 19 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 93 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఇక్కడి నుంచి మాథ్యూ బ్రీట్జ్కే ట్రిస్టన్ స్టబ్స్‌తో కలిసి నాల్గవ వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ద్వారా జట్టును బలమైన స్థితిలో ఉంచాడు. బ్రీట్జ్కే 77 బంతుల్లో 85 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. అతని ఇన్నింగ్స్‌లో మూడు సిక్సర్లు, ఏడు ఫోర్లు ఉన్నాయి. దీంతో పాటు, స్టబ్స్ 58 పరుగులు సాధించగా, డెవాల్డ్ బ్రెవిస్ 42 పరుగులు జట్టు ఖాతాలోకి చేర్చాడు. ఇంగ్లాండ్ తరపున జోఫ్రా ఆర్చర్ అత్యధికంగా నాలుగు వికెట్లు పడగొట్టగా, ఆదిల్ రషీద్ రెండు విజయాలు సాధించాడు. వీటితో పాటు, జాకబ్ బెథెల్ ఒక వికెట్ తీశాడు. దీనికి ప్రతిస్పందనగా, ఇంగ్లాండ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 325 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆతిథ్య జట్టు తరపున జోస్ బట్లర్, జో రూట్ 61-61 పరుగులు సాధించగా, జాకబ్ బెథెల్ 58 పరుగులు చేసి ఇంగ్లాండ్‌ను గెలిపించలేకపోయాడు. దక్షిణాఫ్రికా తరపున నాండ్రే బర్గర్ మూడు వికెట్లు పడగొట్టాడు. కేశవ్ మహారాజ్ రెండు విజయాలు సాధించాడు.




# రుతురాజ్ గైక్వాడ్ అద్భుతమైన ఇన్నింగ్స్

భారత క్రికెట్ జట్టులో చోటు సంపాదించడానికి చాలా మంది ఆటగాళ్ళు తరచుగా ఇబ్బంది పడుతుంటారు. జట్టులో చోటు సంపాదించాలంటే, ఆటగాళ్ళు దేశీయ, ఐపీఎల్‌లో సత్తా చాటాల్సి ఉంటుంది. తద్వారా వారు భారత జట్టులో చోటు సంపాదించగలరు. ఇంతలో, ఓ ఆటగాడు దులీప్ ట్రోఫీ 2025లో తన అద్భుతమైన ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు. దేశీయ క్రికెట్‌లో నిలకడగా రాణించినప్పటికీ, ఈ ఆటగాడు భారత జట్టులో చోటు సంపాదించలేకపోతున్నాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న 2025 దులీప్ ట్రోఫీ రెండవ సెమీఫైనల్లో వెస్ట్ జోన్ బ్యాట్స్‌మన్, చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను వెస్ట్ జోన్ జట్టును క్లిష్ట పరిస్థితి నుంచి తిరిగి తీసుకువచ్చి బలమైన స్థితికి తీసుకువచ్చాడు. అతని ఇన్నింగ్స్ వెస్ట్ జోన్ జట్టును క్లిష్ట పరిస్థితి నుంచి రక్షించి బలమైన స్థితిలో ఉంచడానికి పనిచేసింది. ఈ సమయంలో రుతురాజ్ గైక్వాడ్ బౌండరీల వర్షం కురిపించాడు. కానీ, చివరికి అతనికి మ్యాచ్ మధ్యలో ఊహించని సంఘటన చోటు చేసుకోవడంతో అతని హృదయాన్ని ముక్కలు చేసేసింది. దులీప్ ట్రోఫీ సెమీ-ఫైనల్ మ్యాచ్‌లో, వెస్ట్ జోన్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది. అయితే, జట్టుకు చాలా చెడ్డ ఆరంభం లభించింది. ఓపెనర్లు త్వరగా పెవిలియన్‌కు తిరిగి వచ్చారు. జట్టు స్కోరు రెండు వికెట్లు కోల్పోయి 10 పరుగులు మాత్రమే అయింది. జట్టు ఇబ్బందుల్లో ఉన్నట్లు కనిపించింది. ఇటువంటి పరిస్థితిలో, రుతురాజ్ గైక్వాడ్ క్రీజులోకి అడుగుపెట్టి తన బాధ్యతను చాలా చక్కగా నిర్వర్తించాడు. అతను మొదట వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ ఆర్య దేశాయ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిర్వహించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 82 పరుగుల ముఖ్యమైన భాగస్వామ్యం నెలకొల్పారు. దేశాయ్ 40 పరుగులు అందించగా, గైక్వాడ్ నిరంతరం పరుగులు చేస్తూ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. ఆ తర్వాత, గైక్వాడ్‌కు శ్రేయాస్ అయ్యర్ మద్దతు లభించింది. అయితే, అయ్యర్ ఎక్కువ ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. 28 బంతుల్లో 25 పరుగులు చేసిన తర్వాత అవుట్ అయ్యాడు. కానీ ఈలోగా, గైక్వాడ్ పరుగులు సాధించే వేగాన్ని కొనసాగించి తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. రుతురాజ్ గైక్వాడ్ చాలా సంయమనంతో బ్యాటింగ్ చేసి 131 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అతని ఇన్నింగ్స్‌లో నిరంతరం ఫోర్ల వర్షం కనిపించింది. సెంచరీ చేరుకునే సమయంలో అతను 16 ఫోర్లు కొట్టాడు. టీ సమయం వరకు, అతను అజేయంగా 121 పరుగులతో ఆడుతూ జట్టును బలమైన స్థితికి తీసుకెళ్లాడు. సెషన్ మారిన తర్వాత కూడా గైక్వాడ్ తన అద్భుతమైన ఆటను కొనసాగించాడు. స్ట్రైక్‌ను రొటేట్ చేస్తూ పెద్ద షాట్లు కూడా కొట్టాడు. చివరికి, అతను 206 బంతుల్లో 184 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ సమయంలో, అతని బ్యాట్ నుంచి 25 ఫోర్లు, ఒక సిక్సర్ వచ్చాయి. అయితే, అతను డబుల్ సెంచరీకి చాలా దగ్గరగా ఆగిపోయాడు. కేవలం 16 పరుగుల దూరంలో ఉన్నాడు. అతన్ని సరాన్ష్ జైన్ అవుట్ చేశాడు. గైక్వాడ్ ఇన్నింగ్స్ కారణంగా, వెస్ట్ జోన్ పేలవమైన ఆరంభం ఉన్నప్పటికీ పెద్ద స్కోరు సాధించడానికి పునాది వేసింది. ప్రారంభ ఎదురుదెబ్బల తర్వాత అతని సహకారం నిర్ణయాత్మకంగా నిరూపితమైంది. అతను అవుట్ అయ్యే సమయానికి, వెస్ట్ జోన్ స్కోరు బలమైన స్థానానికి చేరుకుంది. ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. రుతురాజ్ గైక్వాడ్ ఈ ప్రదర్శన దేశీయ క్రికెట్‌లో అతని స్థిరత్వాన్ని చూపిస్తుంది. దీనికి ముందు కూడా, అతను పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో అతనికి ఎక్కువ అవకాశం లభించకపోయినా, దులీప్ ట్రోఫీలో ఈ ఇన్నింగ్స్ అతని ఫామ్, ఫిట్‌నెస్‌కు స్పష్టమైన సూచన.

# హార్దిక్ పాండ్య ఓ అరుదైన రికార్డు సాధించే ఛాన్స్



2025 ఆసియా కప్ టోర్నమెంట్ మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానుంది. దుబాయ్ వేదికగా టీ20 ఫార్మాట్‌లో ఈ టోర్నీ జరగనుంది. సెప్టెంబర్ 10న భారత్ తమ తొలి మ్యాచ్‌లో యుఏఈతో తలపడనుంది. అయితే ఈ టోర్నీలో టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఓ అరుదైన రికార్డు సాధించే ఛాన్స్ ఉంది. ఆ ఘనత అందుకుంటే భారత తొలి క్రికెటర్?గా చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. హార్దిక్ పాండ్య 2016లో టీ20తోనే అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అప్పట్నుంచి 9ఏళ్లుగా భారత జట్టులో కీలక ప్లేయర్?గా రాణిస్తున్నాడు. బ్యాటుతోపాటు, బంతితోనూ అద్భుతాలు సృష్టించి టీమ్‌ఇండియా అనేక విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అలా ఇప్పటిదాకా అంతర్జాతీయ టీ20 కెరీర్?లో 114 మ్యాచ్?ల్లో భారత్?కు ప్రాతినిధ్యం వహించాడు. ఇందులో ఇప్పటిదాకా 1812 పరుగులు చేశాడు. ఇందులో 5 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అలాగే బౌలింగ్?లో 94 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్? తర్వాత దాదాపు మూడు నెలల తర్వాత హార్దిక్ పాండ్య బరిలోకి దిగనున్నాడు. ఆసియా కప్?లో కీలక ఆల్?రౌండర్?గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ఈ క్రమంలోనే పాండ్యను ఓ అరుదైన రికార్డు ఊరిస్తోంది. ఈ టోర్నీలోనే ఆ ఘనత అందుకునే అవకాశం ఉంది. పాండ్య ఇంకో 6 వికెట్లు పడగొడితే 100 టీ20 వికెట్లు పూర్తి చేసుకుంటాడు. ఈ క్రమంలోనే అంతర్జాతీయ టీ20 కెరీర్?లో భారత్? తరఫున 1000 పరుగులు, 100 వికెట్లు పూర్తి చేసిన ఏకైక క్రికెటర్?గా రికార్డుల్లోకెక్కుతాడు. ఇదివరకు భారత్? నుంచి ఏ క్రికెటర్ కూడా టీ20ల్లో ఈ ఘనత సాధించలేదు. కానీ అరంగేట్రం చేసిన తొమ్మిదేళ్లకే చరిత్ర సృష్టించే అవకాశం పాండ్య ముంగిట ఉంది. పాండ్య ఈ ఘనత అందుకుంటే, ప్రపంచంలో ఈ రికార్డు సాధించిన మూడో క్రికెటర్?గానూ నిలుస్తాడు. ఇంటర్నేషనల్ టీ20ల్లో ఇప్పటివరకు బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ షకీబ్ అల్ హసన్, ఆఫ్ఘానిస్థాన్ ఆల్?రౌండర్ మహ్మద్ నబీ మాత్రమే 1000ం పరుగులతోపాటు, 100ం వికెట్లు పడగొట్టిన ప్లేయర్లుగా ఉన్నారు. దీంతో పాండ్య 100 వికెట్ల మైలురాయి అందుకోగానే, ప్రపంచంలోనే ఇంతటి అరుదైన ఘనత సాధించిన మూడో క్రికెటర్?గా రికార్డు సృష్టిస్తాడు. కాదా, ఈ టోర్నీలో టీమ్‌ఇండియా లీగ్, సూపర్ 4 స్టేజ్?లో కలిసి ఐదు మ్యాచ్?లు ఆడే ఛాన్స్ ఉంది. సెమీస్, ఫైనల్?కు చేరుకుంటే ఇంకా ఎక్కువ మ్యాచ్?లు ఆడుతుంది. అయితే ఈ రికార్డుకు పాండ్య కేవలం 6 వికెట్ల దూరంలోనే ఉన్నాడు. దీంతో ఆరు వికెట్లు పడగొట్టడం పాండ్యకు పెద్ద కష్టమేమీ కాదు. అందుకే ఈ టోర్నీలోనే హార్దిక్ ఈ ఘనత సాధించే ఛాన్స్ ఉంది. ఆసియా కప్ టోర్నీలో పాల్గొనేందుకు టీమ్‌ఇండియా ప్లేయర్లు ఇప్పటికే యూఏఈ చేరుకోగా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హారిక్ గురువారం యూఏఈ బయల్దేరారు. ఈ ఇద్దరూ ముంబయి ఎయిర్?పోర్టులో కనిపించారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి.




# ఫుల్ జోష్‌లో మన శంకర వరప్రసాద్ గారు

## తాజా షూటింగ్ షెడ్యూల్ విడుదల



అనిల్ రావిపూడి దర్శకత్వంలో అగ్రకథానాయకుడు చిరంజీవి నటిస్తోన్న చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. చిరుతో పాటు- ఈ సినిమా టీమ్ మొత్తం ఫుల్ జోష్‌తో ఉంది. తాజా అప్‌డేట్‌ను చిత్రబృందం షేర్ చేసింది. కొత్త షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను పంచుకుంది. ఇప్పటికే ఈ సినిమా కేరళలో కొన్ని షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మరో షెడ్యూల్‌ను ప్రారంభించారు. నేటి నుంచి సెప్టెంబర్ 19 దాకా చిత్రీకరణ జరగనుంది. ఇందులో రెండు పాటలు చిత్రీకరించనున్నట్లు- టీమ్ తెలిపింది. ఇవి కొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని పేర్కొంది. సంక్రాంతికి ఈ సినిమాతో ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ ఇవ్వనున్నట్లు- టీమ్ తెలిపింది. వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ మూవీని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. తాజాగా సాహు గారపాటి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అక్టోబర్ 5 నుంచి నిర్వహించనున్న మరో షెడ్యూల్‌లో వెంకటేశ్ భాగం కానున్నట్లు- తెలిపారు ఇక వచ్చే ఏడాది చిరంజీవి వరుసగా రెండు సినిమాలతో అలరించనున్నారు. ఏడాది ప్రారంభంలో సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్‌గారు'తో సందడి చేసేందుకు సిద్ధమవుతుండగా.. వేసవిలో 'విశ్వంభర'తో పలకరించనున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా 'విశ్వంభర' ముస్తాబవుతోంది. ఇందులో వీఎఫ్ఎక్స్‌కు అధిక ప్రాధ్యానత ఉండగా.. 'మన శంకర వరప్రసాద్‌గారు'లో 5 శాతం మాత్రమే వీఎఫ్ఎక్స్ ఉపయోగించారు. 'విశ్వంభర'లో చిరు సరసన త్రిష కనిపించనుండగా.. 'మన శంకర వరప్రసాద్‌గారు'లో నయనతార నటిస్తున్నారు. ఈ రెండు సినిమాల ప్రచార చిత్రాలు ఆకట్టుకోవడంతో వీటిపై అంచనాలు నెలకొన్నాయి.

# కాంతారా-2లో రిషబ్ యాక్షన్ సన్నివేశాలు



కన్నడ నటుడు రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'కాంతార చాప్టర్ 1' 2022లో వచ్చిన 'కాంతార'కు ప్రీక్వెల్‌గా ఇది సిద్ధమవుతోంది. రిషబ్ స్వీయ దర్శకత్వంలో ముస్తాబవుతోన్న ఈ సినిమా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా స్టంట్ కొరియోగ్రాఫర్ అర్జున్ రాజ్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాలను రిషబ్ స్వయంగా చేశారని తెలిపారు. ఒక్క యాక్షన్ సన్నివేశంలో కూడా డూప్ ఉపయోగించలేదు. రిషబ్ రిస్క్ చేసి ఎన్నో స్టంట్స్ చేశారు. ఆయన కెరీర్‌లో ఇప్పటి వరకూ చేయని యాక్షన్ సన్నివేశాలను కూడా డూప్ లేకుండా చేశారు. కత్తి యుద్ధం, గుర్రపు స్వారీలతో పాటు- యుద్ధ కళగా ప్రాచుర్యం పొందిన కలరిపయట్టు- లోనూ శిక్షణ తీసుకున్నారు. నేను ఇప్పటి వరకూ చాలా మంది నటు-లతో వర్క్ చేశాగానీ రిషబ్‌లాంటి హీరోను చూడలేదు. 'నేను నా శాయశక్తులా ప్రయత్నిస్తాను అని అనడు.. నేను బ్రతికి ఉన్నంత వరకూ దీన్ని చేస్తాను' అని చెబుతాడు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తి అంటూ స్టంట్ కొరియోగ్రాఫర్ అర్జున్ రాజ్ హీరో రిషబ్‌పై ప్రశంసలు కురిపించారు. కాంతార' రూ. 16 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి, రూ. 400 కోట్లు వసూళ్లు చేయడం విశేషం. తొలిభాగం కథ ఎక్కడి నుంచి ప్రారంభమైందో.. దానికి ముందు జరిగిన సంఘటనలను 'కాంతార చాప్టర్ 1'లో చూపించనున్నారు. పంజుర్లికి సంబంధించిన సన్నివేశాలు ప్రీక్వెల్‌లో ఎక్కువగా ఉండనున్నాయి. ముందుగా కన్నడలో విడుదలై హిట్‌గా నిలిచిన 'కాంతార'.. ఆ తర్వాత ఇతర భాషల్లో డబ్ అయిన సంగతి తెలిసిందే. 'కాంతార 2'ను ఒకేసారి అన్ని భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## మెరిసిపోతున్న అనన్య..

**ప్రస్తుతం ప్రపంచ ఫ్యాషన్ ప్రియులను అలరించడానికి GQ ఇండియా బెస్ట్ డ్రెస్డ్ 2025" ఈవెంట్ ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఇందులో ప్రత్యేకించి కొంతమంది హీరోయిన్స్ తమ అద్భుతమైన ఆకర్షణతో అందరి దృష్టిని తమ వైపు తిప్పుకున్నారు. ముఖ్యంగా వినూత్నమైన.. సరికొత్త హంగులతో రూపొందించిన ఈ దుస్తులు అటు చూసే ఆడియన్స్ కు కన్నుల విందుగా అనిపించడమే కాకుండా.. వీటిని ధరించిన సెలబ్రిటీలను దేవకన్యలుగా మార్చేశాయని చెప్పవచ్చు. ఈ క్రమంలోనే తాజాగా ముత్యాలతో చాలా ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఒక డ్రెస్ ను ప్రముఖ హీరోయిన్ అనన్య పాండే ధరించింది. ఈ డ్రెస్ ఈమె అందాన్ని మరింత రెట్టింపు చేసిందని చెప్పవచ్చు. వన్ పీస్ డ్రెస్ గా డిజైన్ చేసిన ఈ ముత్యాల డ్రెస్ థైస్ కనిపించేలా పైకి చాలా అందంగా తయారు చేశారు.. సుమారుగా కొన్ని వేల ముత్యాలను ఈ డ్రెస్ డిజైనింగ్ కోసం ఉపయోగించినట్లు తెలుస్తోంది. అనన్య పాండే ధరించిన ఈ డ్రెస్ చూసి కుర్రాలలో కవిత్వం పుట్టుకొస్తోంది. ముత్యములా కనిపిస్తున్న నిన్ను చూసి చంద్రుడు కూడా సిగ్గుపడతాడేమో సఖి అంటూ ఎవరికి వారు కవిత్వాలు పలికేస్తున్నారు. ఇంకొంతమంది అప్పుడే ముత్యపు దిబ్బ నుండి బయటకు వచ్చావా అంటూ కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికైతే అనన్య పాండే ధరించిన ఈ డ్రెస్ ఆమె అందాన్ని రెట్టింపు చేయడమే కాకుండా ఇలాంటి ఫ్యాషన్ దుస్తులు కూడా ఉంటాయా అని అభిమానుల సైతం నోరెళ్లపెట్టేలా చేస్తోందని చెప్పవచ్చు. ప్రస్తుతం అనన్యకు సంబంధించిన ఈ ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.**

# పుష్ప తరహాలో గంజాయి స్మగ్లింగ్

## అనుష్క నటించి మెప్పించిన ఘాటి



సున్నితమైన కథలతో సినీప్రియుల్ని అలరించే దర్శకుడు క్రిష్ జాగర్లమూడి. అనుష్కను యాక్షన్ కోణంలో చూపిస్తూ 'ఘాటి' సినిమాని తీసుకొచ్చారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లోని తూర్పు కనుమల్లో జరిగే కథ ఇది. అక్కడి ఎత్తయిన పర్వతాల మధ్య ఓ కొండ నీడ మరో కొండపై పడే చోట నాలుగు రకాల గంజాయిలు పెరుగుతాయి. వాటిలో అత్యంత నాణ్యమైనది, ఖరీదైనది శీలావతి రకం. ఆ కనుమల్లో పండే ఈ గంజాయి పంటపై పూర్తి ఆధిపత్యం కాష్టాల నాయుడు (రవీంద్ర విజయ్), కుందుల నాయుడు (చైతన్య రావు) సోదరులదే. కనుమల్లో పండే గంజాయి పంటను ఘాటీ తెగ కూలీలు పోలీసుల కంట పడకుండా అక్రమంగా నాయుడు సోదరుల అడ్డాకు చేరవేస్తే.. దాన్ని వాళ్లు తమ బాస్ మహావీర్ (జిషు సేన్ గుప్తా)కు పంపుతారు. అతని కార్టెల్ దాన్ని దేశ విదేశాలకు అక్రమ మార్గాల్లో ఎగుమతి చేసి సొమ్ము చేసుకోవడం పరిపాటి. అయితే ప్రాణాలకు తెగించి గంజాయిని అక్రమ రవాణా చేసే ఘాటీలకు కష్టానికి తగ్గ ఫలితం, గౌరవం దక్కకపోవడంతో ఆ తెగకు చెందిన దేశీరాజు (విక్రమ్ ప్రభు) ఓ ఆలోచన చేస్తాడు. తన మరదలు శీలావతి (అను)తో పాటు- తోటి ఘాటీలతో కలిసి ఓ కొత్త దందాకు తెర లేపుతాడు. గంజాయిని ద్రవరూపంలోకి మార్చి దేశ విదేశాలకు ఎగుమతి చేయడం మొదలు పెడతారు. అయితే ఈ విషయం నాయుడు సోదరులకు తెలియడంతో ఘాటీలను అంతమొందించేందుకు సిద్ధమవుతారు. ఈ క్రమంలో శీలావతికి జరిగిన అన్యాయమేంటి? నాయుడు సోదరులతో ఆమె ఎలాంటి యుద్ధం చేసిందన్నదే సినిమా కథ. ఇది గంజాయి అక్రమ రవాణా నేపథ్యంలో సాగే కథగా కనిపించినప్పటికీ.. ప్రధానంగా ఇదొక ప్రతీకార కథ. . నిజానికి ఈ కథ.. దీంట్లోని స్మగ్లింగ్ నేపథ్యాన్ని చూస్తే 'పుష్ప' ఛాయల్లో నుంచి వచ్చిన సినిమాలాగే అనిపిస్తుంది. అయితే అందులో హీరో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ తన సామ్రాజ్యాన్ని అంతకంతకూ విస్తరించుకుంటూ వెళ్లే ప్రయత్నం చేయగా.. ఇందులో కథానాయిక గంజాయి స్మగ్లింగ్ వల్ల జరుగుతున్న అనర్థాల్ని, దారుణాల్ని చూసి ఆ స్మగ్లింగ్‌నే ఆపి తమ తెగతో పాటు ఎంతో మంది ప్రజల్ని కాపాడేందుకు నడుం బిగిస్తుంది. తూర్పు కనుమలు.. అక్కడి కొండల మధ్య సాగే గంజాయి అక్రమ సాగు.. దాన్ని దందాగా చేసుకుని బతికే నాయుడు సోదరులు.. అతనిపైనున్న కార్పొరేట్ ముఠాను చూపిస్తూ కథను ప్రారంభించిన తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. ఆ తర్వాత ఘాటి తెగను తెరపైకి తెచ్చి వాళ్ల నేపథ్యాన్ని.. గంజాయి స్మగ్లింగ్‌లో వాళ్ల శక్తి సామర్థ్యాల్ని పరిచయం చేశారు. ప్రథమార్ధమంతా ఓ సామాన్య మహిళగా కనిపించిన కథానాయిక పాత్ర.. ద్వితీయార్ధంలో ఆరంభం నుంచే అమ్మోరులా విజృంభించడం ప్రేక్షకుల్లో ఓ జోష్‌ను నింపుతుంది. ఈ క్రమంలో గుహలో నాయుడు ముఠాతో జరిగే యాక్షన్ సీక్వెన్స్, బస్సులో పోలీసు తల తెగ నరికే ఎపిసోడ్ రోమాంచితంగా ఉంటాయి. శీలావతిగా పూర్తి రా అండ్ రస్టిక్ లుక్‌లో అనుష్క ఆకట్టుకుంది. ఆమె ఇంత వరకూ ఈ తరహా పాత్రలో కనిపించలేదు. యాక్షన్ సన్నివేశాల్లోనూ అదరగొట్టింది. విద్యాసాగర్ పాటలు, నేపథ్య సంగీతం సినిమాకి బలాన్నిచ్చాయి. తూర్పు కనుమల అందాల్ని మనోజ్ తన కెమెరాతో చక్కగా ఒడిసిపట్టారు.

# హాస్యాన్ని పండిస్తూ సాగే ప్రేమ కథ

## కొత్త తరహాలో ...లిటిల్ హార్ట్స్



ఈటీవీ విన్ ప్రొడక్షన్ నుంచి వస్తున్న మొట్ట మొదటి థియేట్రికల్ సినిమా 'లిటిల్ హార్ట్స్'. '90స్ మిడిల్‌క్లాస్ బయోపిక్'తో యువతకు చేరువైన మౌళి తనూజ్ ఇందులో కథానాయకుడిగా నటించగా, ఆ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు ఆదిత్య హసన్ దీనికి నిర్మాత కావడం విశేషం. అఖిల్ (మౌళి తనూజ్) చదువుల్లో అంతంత మాత్రమే. అందుకే ఎంసెట్‌లో ర్యాంక్ రాదు. పేమెంట్ సీట్‌తో ఏదో ఒక కాలేజీలో ఇంజినీరింగ్ చేరాలనుకుంటాడు. కానీ, తండ్రి గోపాలరావు (రాజీవ్ కనకాల) మాత్రం లాంగ్ టర్మ్ కోచింగ్‌కి పంపిస్తాడు. కాత్యాయని (శివానీ నాగారం)ది కూడా అదే కథే. ఆమె తల్లిదండ్రులిద్దరూ డాక్టర్లే. తమ కూతురిని కూడా డాక్టర్‌గా చూడాలనేది వాళ్ల లక్ష్యం. అందుకే కాత్యాయని కూడా ఇంటర్ తర్వాత లాంగ్‌టర్మ్ కోచింగ్‌లో చేరుతుంది. అక్కడే అఖిల్, కాత్యాయని పరిచయమవుతారు. ఆ పరిచయం ప్రేమకు దారితీస్తుంది. అఖిల్ తన మనసులో మాటని బయట పెడతాడు. అప్పుడు కాత్యాయని తనకు సంబంధించిన ఓ విషయాన్ని బయట పెడుతుంది. దాంతో ఈ జంట ప్రేమకథలో ఓ పెద్ద మలుపు తీసుకుంటుంది. స్కూల్ డేస్‌లోనూ... కాలేజీలోనూ మొగ్గ తొడిగిన ప్రేమకథలతో తరచూ సినిమాలు వస్తూనే ఉంటాయి. క్యాంపస్ స్టోరీలుగా, రొమాంటిక్ కామెడీ కథలుగా అవి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితం. వాటికి భిన్నంగా కోచింగ్ సెంటర్ నేపథ్యంలో సాగే ప్రేమకథతో ఈ చిత్రం రూపొందింది. ట్రైలర్‌లో చెప్పినట్టే అంతగా చదువు అబ్బని ఓ అబ్బాయి, అమ్మాయి చుట్టూ తిరిగే కథ ఇది. చాలా సింపుల్‌గానే ఉంటుంది. కానీ, కావల్సినంత ఫన్‌ని పండిస్తుంది. యువతరం నేపథ్యంలో సాగే ఇలాంటి సరదా సరదా సినిమాలు ఈ మధ్య కాలంలో రాలేదు. హీరోకి ముందే ఓ ప్రేమకథ ఉన్నా... హీరోయిన్‌కి దగ్గరయ్యేందుకు అతను చేసే ప్రయత్నాలే ప్రధానంగా ప్రథమార్ధం సాగుతుంది. తన కొడుకు గురించి ఐఐటీ-, ఎన్ఐటీ- అంటూ పెద్ద పెద్ద కలలు కని, నిరాశచెందే ఓ ఫ్రస్ట్రేటెడ్ తండ్రిగా రాజీవ్ కనకాల.. అంతే ఫ్రస్ట్రేషన్‌తో కనిపించే హీరో ఫ్రెండ్ మధు (జయకృష్ణ) చేసే సందడి ప్రథమార్థానికి హైలైట్. కాత్యాయని పాట చుట్టూ అల్లిన సన్నివేశాలు ద్వితీయార్థానికి మరింత బలాన్ని ఇచ్చాయి. రచనలో ఉన్న బలం అది. హీరోయిన్ ఇంట్లో సన్నివేశాలు, హీరో తమ్ముడు చేసే అల్లరి, బాహుబలి రిజల్ట్‌ని హీరోహీరోయిన్ల ప్రేమకథతో ముడిపెడుతూ సినిమాని నడిపించిన తీరు... ఇలా ప్రతి ప్రయత్నం, ప్రతి పాత్ర నవ్వులు పంచేదే. ఇంటిల్లిపాదీ కలిసి ఆస్వాదించే స్వచ్ఛమైన హాస్యం ఈ సినిమాకి కలిసొచ్చే మరో అంశం.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463